కడప-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

ఆదివారం 19 జూలై 2026


విరూపాక్షమ్మ తల్లి జాతర 3వ రోజు

# భక్తి పారవశ్యం..

## ప్రత్యేక హోమాలు, అన్నదాన సేవల్లో పాల్గొన్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి







**రాయచోటి, జూలై 18, ప్రభాతవార్త:**
చిన్నమండెం మండలం పడమటికోన గ్రామం బోరెడ్డి గారి పల్లెలో నిర్వహిస్తున్న శ్రీ విరూపాక్షమ్మ తల్లి జాతర మహోత్సవాలు 3వ రోజు అత్యంత వైభవంగా కొనసాగాయి. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆయన సతీమణి హరితమ్మ కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, హోమాల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తుల కోసం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని అన్నదాన సేవలో భాగస్వాముల య్యారు. జాతరకు విచ్చేసిన భక్తులతో ఆప్యాయంగా మమేకమై వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అమ్మవారి కృపాకటాక్షాలు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## పల్లకి ఊరేగింపులో పాల్గొన్న మంత్రి



**రాయచోటి, జూలై 18, ప్రభాతవార్త:**
విరూపాక్షమ్మ తల్లి జాతర మహోత్సవాల చివరి రోజు పల్లకి ఊరేగింపులో భక్తి భావంతో పాల్గొన్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కుటుంబ సభ్యులు విరూపాక్షమ్మ తల్లి జాతర మహోత్సవాల చివరి రోజు నిర్వహించిన అంగరంగ వైభవమైన పల్లకి ఊరేగింపు కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా, యువజన !! క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, వారి సతీమణి హరితమ్మ, కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా మంత్రి గారు భక్తిశ్రద్ధలతో అమ్మవారి పల్లకిని స్వయంగా మోసి తన భక్తిని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ రెడ్డి వారి సతీమణి సౌమ్యరెడ్డి, మంత్రి కుమారుడు మండిపల్లి నిశ్చల్ నాగిరెడ్డి, కుటుంబ సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎన్యుమరేషన్ ఫారాలు 24వ తేదీలోగా అందజేయాలి

### ఆర్డీఓ నారాయణరెడ్డి



**పీలేరు, జూలై 18, ప్రభాతవార్త:**
పీలేరు అసెంబ్లీ నియోజక వర్గంలో సర్ కార్యక్రమంలో ఇంత వరకు ఎన్యూమరేషన్ ఫారంలు అందచేయని వారు ఈ నెల 24లో పు అందచేయాలని ఆర్డీవో నారా యణరెడ్డి అన్నారు. శనివారం ఆర్డీ వో కార్యాలయంలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో 2,36,532 ఓటర్లకు గానూ 2,09,195 ఎన్యూమరేషన్ ఫారంలు తిరిగి వచ్చాయని తెలిపారు. 88.44 శాతం సాధించినట్లు చెప్పారు. ఇప్పటి వరకు తిరిగి ఇవ్వని వారు అందజేస్తే వాటిని పునఃపరిశీలించి వారి పేర్లు నమోదు చేస్తామన్నారు. నియోజకవర్గంలో చనిపో యినవారు 8,779, డబుల్ ఎంట్రీలు 4,483, ఊరు వదలి వెళ్లినవారు. 9,335 ఓటర్లను గుర్తించినట్లు తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్కో సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.శివకుమార్ పాల్గొన్నారు.






## గంజాయి స్వాధీనం ముగ్గురు నిందితులు అరెస్ట్



**ప్రొద్దుటూరు క్రైమ్ జూలై 18 ప్రభాతవార్త**
ఏఎస్పీ విభూ కృష్ణ శనివారం ప్రొద్దుటూరు ఏఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ త్రీ టౌన్ పోలీసులు చేపట్టిన ప్రత్యేక దాడిలో 4 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. పట్టణంలోని బొల్లవరం వెంకటేశ్వర స్వామి ఆలయానికి ఉత్తరం వైపున కాలువ కట్ట సమీపంలోని కంప చెట్ల వద్ద గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు అందిన సమాచారంతో త్రీ టౌన్ పోలీసులు దాడి నిర్వహించినట్లు ఏఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా ఇద్దరు యువకులు, ఓ మహిళను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 4 కిలోల గంజాయితో పాటు రూ.3 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అరెస్ట్ అయిన వారిలో గాళం సిద్దయ్య అలియాస్ శివ, ఉరిమిళ్ల శ్రీనివాసులు అలియాస్ వాసు, బాణాల సువార్త ఉన్నారని తెలిపారు. వీరు గంజాయిని తీసుకువచ్చి స్థానికంగా విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడైందన్నారు. ఈ ఘటనపై ప్రొద్దుటూరు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఏఎస్పీ విభూ కృష్ణ తెలిపారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని, ఇలాంటి కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో త్రీ సిబ్బంది పాల్గొన్నారు.

# పరిశుభ్రతలో అన్నమయ్య జిల్లా ఆదర్శంగా నిలవాలి

### స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్రజల భాగస్వామ్యం మరింత పెరగాలి

### రాష్ట్రంలోని ఉత్తమ మూడు మున్సిపాలిటీల్లో మదనపల్లెకు చోటు దక్కడం జిల్లాకు గర్వకారణం

### రాయచోటిలో మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ ప్రారంభించిన జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్..



**రాయచోటి,టౌన్ జూలై 18: ప్రభాతవార్త**
జిల్లాను పరిశుభ్రంగా, పచ్చదనంతో కూడిన స్వర్ణాంధ్రగా తీర్చిదిద్దేందుకు జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తోందని.. ప్రజల భాగస్వామ్యంతోనే పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించగలమని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. శనివారం రాయచోటి మున్సిపల్ పరిధిలోని శెట్టివారిపల్లి రోడ్డు డంపింగ్ యార్డు వద్ద మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెటీరియల్ రికవరీ ఫెసిలిటీను ప్రారంభించి, అక్కడ జరుగుతున్న పరిశుభ్రత, ఘన వ్యర్థాల నిర్వహణ కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి నెల మూడో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని జిల్లాలో విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత నెల నిర్వహించిన ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమానికి ప్రజలు, ప్రభుత్వ అధికారులు, ప్రజా సంఘాలు, విద్యార్థులు పెద్ద ఎత్తున స్పందించి పాల్గొన్నారని చెప్పారు. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించినందుకు 50 వేల నుంచి 3 లక్షల జనాభా గల మున్సిపాలిటీల విభాగంలో రాష్ట్రంలోని ఉత్తమ మూడు మున్సిపాలిటీల్లో మదనపల్లె మున్సిపాలిటీకి స్థానం దక్కడం జిల్లాకు గర్వకారణమని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మదనపల్లె మున్సిపల్ కమిషనర్ గౌరవ ముఖ్యమంత్రి చేతుల మీదుగా పురస్కారం అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఇప్పటివరకు సుమారు 2.68 లక్షల మంది పౌరులు పాల్గొని పరిశుభ్రత కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారని కలెక్టర్ తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతోనే ఇటువంటి కార్యక్రమాలు విజయవంతమవు తాయన్నారు రాయచోటి డంపింగ్ యార్డు వద్ద ప్రారంభించిన మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ ద్వారా ఘన వ్యర్థాల నిర్వహణలో మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. రాయచోటి మున్సిపాలిటీలో రోజుకు సుమారు 60 టన్నుల ఘన వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయని, వాటిలో ప్లాస్టిక్, రబ్బరు తదితర వ్యర్థాలను శాస్త్రీయంగా వేరు చేసి పునర్వినియోగానికి పంపించడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు మున్సిపాలిటీకి అదనపు ఆదాయం సమకూరుతుందని చెప్పారు. రోజుకు 20 టన్నుల వ్యర్థాలను శుద్ధి చేసే సామర్థ్యంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే రాయచోటిలో ఘన వ్యర్థాల నిర్వహణకు అవసరమైన పూర్తి మౌలిక వసతులను త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ వెల్లడించారు. ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణం పూర్తయిందని, విద్యుత్ కనెక్షన్ అందిన వెంటనే కార్యకలాపాలు ప్రారంభమవుతాయని తెలిపారు. అదేవిధంగా చౌడేపల్లి మండలంలో గోవర్ధన్ ప్లాంట్ నిర్మాణం పూర్తయిందని, గుర్రంకొండలో మరో గోవర్ధన్ ప్లాంట్‌ను ఈ నెలాఖరులోగా పూర్తి చేయనున్నట్లు చెప్పారు. ఈ ప్లాంట్ల ద్వారా పశువుల పేడతో పాటు ఇతర జీవ వ్యర్థాలను శాస్త్రీయంగా ప్రాసెస్ చేసి ఉపయోగకరమైన ఉత్పత్తులుగా మార్చే అవకాశం ఉంటుందని తెలిపారు. ..మిగతా 2పేజీలో

## స్వచ్ఛరథం, చెత్త బండి ప్రతి ఇంటి ముందుకు వస్తుంది : సీఈవో




**రాజుపాలెం, జులై 18, ప్రభాతవార్త.**
స్వచ్ఛరథం, చెత్త బండి ప్రతి ఇంటి ముందుకు వస్తుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ సీఈవో సుబ్రహ్మ ణ్యం తెలిపారు. మండల కేంద్రమైన రాజుపాలెం గ్రామంలోని జడ్పీహెచ్ పాఠశాలలో ఎంపీడీవో సురేష్ బాబు అధ్యక్షతన శనివారం నిర్వహించిన స్వచ్ఛంద్రా స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న జడ్పీ సీఈవో మాట్లాడుతూ స్వచ్ఛరథం ద్వారా చెత్త నుండి సంపద మొదలుపెట్టి అనవసరపు ఖర్చులు తగ్గించుకొని పొదుపును అలవాటు చేసుకోవాలని ఆయన తెలిపారు. పరిసరాల పారిశుద్ధ్యము మన ఆరోగ్యము పట్ల సొసైటీకి సరైన అవగాహన లేదని రోగాలతో సహజీవనం చేస్తున్నామని తెలుపుతూ, ప్రపంచ దేశాలలోమన దేశం ఆరోగ్య విషయంలో 144వ స్థానము, విద్యా విధానంలో 136వ స్థానంలో ఉందని అంటే మనకున్న బాధ్యత ఏమిటో అర్థమవుతుందన్నారు. బహిరంగ మలవిసర్జన ఒక దరిద్రపైన అలవాటని, 192 దేశాలలో ఈ దరిద్ర ౯మైన అలవాటే లేదన్నారు. దీంతోపాటు చిన్న పిల్లల పైన లైంగిక దాడులు మన దేశంలో జరగటం పెద్ద ఘోర మన్నారు. అపరిశుభ్రత, కలుషిత నీరు ఆహారపు అలవాట్లు, ప్లాస్టిక్‌తో కలిగే నష్టాలు పైన అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. డిపిఓ రామచంద్ర మాట్లాడుతూ ప్రజల సంపాదనలో 40 శాతం ఆరోగ్యం కోసం ఖర్చు పెడుతున్నారని జబ్బులకు దూరంగా ఉండాలంటే మన పరిసరాల పరిశుభ్రతతో పాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. గ్రామాలలో పారిశుద్ధ్యము త్రాగునీరుకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ఎంపీడీవో మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర ద్వారా మన ఆరోగ్యము, ఆర్థిక అభివృద్ధి గురించి వివరిస్తూ స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్ది స్వచ్ఛ మండలంగా మారుద్దామని పిలుపునిచ్చారు పాఠశాల ఆవరణలో గల డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం స్మార్ట్ కిచెన్‌ను అధికారులు పరిశీలించారు, విద్యార్థులకు వండిన వంటకా లను గురించి అడిగి తెలుసుకుని పాఠశాలలకు క్యారియర్ల ద్వారా అందించే విధానంను పరిశీలించారు. స్మార్ట్ కిచెన్‌లోని బియ్యము కూరగాయలు కోడిగుడ్లు నాణ్యతనుకూడా పరిశీలించారు. మధ్యాహ్నం విద్యార్థులకు వడ్డిం చే భోజనంను పరిశీలించి స్వయంగా వడ్డించి పిల్లలతో పాటు వారు భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ లు ప్రసాద్, రామస్వామి రెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో షాకీర్ అలీ ఖాన్, ఏపిఎం సుజాత, ఏపీఓ వసంత కుమార్, టిడిపి నాయకులు కె.కృష్ణారెడ్డి, బూతురు కృష్ణారెడ్డి, సానా శ్రీనివాసులురెడ్డిలు పాల్గొన్నారు.

### రూ.3.32 కోట్లతో నిర్మించిన ఘన వ్యర్థాల నిర్వహణ

## కేంద్రం ప్రారంభం



**బద్వేలు, జూలై 18, ప్రభాతవార్త:**
బద్వేలు పట్టణాన్ని పరిశుభ్రంగా, పర్యావరణహితంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రూ.3.32 కోట్ల వ్యయంతో నిర్మించిన 40 టన్నుల సామర్థ్యం గల మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ (ఎంఆర్ఎఫ్), సమీకృత ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని శనివారం బద్వేలు డివిజన్ ఆర్డీఓ ఎ. చంద్రమోహన్, బద్వేలు నియోజ కవర్గ టీడీపీ ఇన్‌చార్జి, కడప డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ ఎ. చంద్రమోహన్ మాట్లాడుతూ ఘన వ్యర్థాలను శాస్త్రీయ విధానంలో నిర్వ హించేందుకు ఈ కేంద్రం ఎంతో దోహదపడుతుందని తెలిపారు. తడి, పొడి వ్యర్థాలను వేర్వేరుగా సేకరిం చడం, పునర్వినియోగం, కంపోస్టు తయారీ వంటి కార్యక్రమాలను ఈ కేంద్రం ద్వారా సమర్థవంతంగా చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. టీడీపీ ఇన్‌చార్జి మంచూరు సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ రోజుకు 40 టన్నుల వ్యర్థాలను ప్రాసెస్ చేసే సామర్థ్యంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు ఇంటి వద్దనే తడి, పొడి చెత్తను వేరు చేసి మున్సిపాలిటీకి అందించడం ద్వారా పరిశుభ్రమైన బద్వేలు నిర్మాణానికి సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, పారిశుద్ధ్య సిబ్బంది, టీడీపీ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## హార్టికల్చర్ హబ్ కు స్థల పరిశీలన చేసిన సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి

వార్త 2వ పేజీలో

## మదనపల్లెలో అర్ధరాత్రి అగ్నిప్రమాదం

### మూడు పూజా సామాగ్రి దుకాణాలు దహనం

### రూ. 5 లక్షల ఆస్తి నష్టం!



**మదనపల్లె క్రైం, జూలై 18 ప్రభాతవార్త:**
మదనపల్లె పట్టణంలో శనివారం తెల్లవారుజామున ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. స్థానిక నెహ్రూ బజారులో చాలా ఏళ్లుగా నడుపుతున్న టెంకాయలు, పూజా సామాగ్రి దుకాణాలు ఈ ప్రమాదంలో పూర్తిగా కాలి బూడిదయ్యాయి. తెల్లవారుజామున సుమారు ఒక గంట సమయంలో నెహ్రూ బజారులోని కొబ్బరికాయల దుకాణంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ప్రమాదంపై సమాచారం అందిన వెంటనే మదనపల్లె అగ్నిమాపక కేంద్రాధికారి జి. శివప్ప తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే దట్టమైన పొగలు, తీవ్రమైన మంటలతో కాలుతున్న దుకాణాలను అగ్నిమాపక సిబ్బంది శ్రమించి పూర్తిగా అదుపు చేశారు. దుకాణాల యజమానులు ఎస్. బావాజీ (బావజాన్), సౌకత్ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం అర్ధరాత్రి తమ దుకాణాలకు ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారని వారు ఆరోపిస్తున్నారు. ఈ ప్రమాదంలో దుకాణాల్లో ఉన్న సుమారు రూ. 5 లక్షల విలువైన కొబ్బరికాయలు, ఫర్నిచర్‌తో పాటు కుంకుమ, కర్పూరం, సాంబ్రాణి కడ్డీలు, గంధము, దీపాల నూనె వంటి పూజా సామాగ్రి పూర్తిగా కాలిపోయాయన్నారు. తమ కుటుంబాలకు జీవనాధారంగా ఉన్న దుకాణాలు బూడిదవ్వడంతో బాధితులు కన్నీరుమున్నీరవుతున్నారు. అయితే, ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు, పోలీసులు, అగ్నిమాపక అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ముదిరెడ్డిపల్లె ,తిప్పిరెడ్డిపల్లె చెరువులకు ఎత్తిపోతల ద్వారా తెలుగు గంగ నీరు

### రూ.5.65 కోట్లతో టెండర్లు

రాజంపేట, జూలై 18 ప్రభాతవామైదుకూరు మండలంలోని ముదిరెడ్డిపల్లె ,తిప్పిరెడ్డిపల్లె చెరువులకు తెలుగు గంగ నీరు నింపేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు తెలుగు గంగ ప్రధాన కాలువ 120.925 కిలోమీటర్ వద్ద నుంచి ఈ రెండు చెరువులకు నీళ్ల ఎత్తిపోతల పథకం ద్వారా నీరు నింపేందుకు శనివారం టెండర్ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ముదిరెడ్డి పల్లె చెరువుకు 12.50 ఎంసిఎఫ్ టి, తిప్పిరెడ్డిపల్లె చెరువుకు23.210ఎంసిఎఫ్ టిల నీటిని ఎత్తిపోతల ద్వారా మళ్లించేందుకు 5.65 కోట్లతో తెలుగు గంగ ప్రాజెక్టు ఎస్ఈ టెండర్ ఉత్తర్వులు జారీ చేశారు.




## ఇండస్ట్రియల్ పార్కులను సందర్శించిన జనసేన పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, ఏపీఐఐసీ డైరెక్టర్ మైఫోర్స్ మహేష్



పీలేరు, జూలై 18, ప్రభాతవార్త: ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి కలప రవి , మండల ఉపాధ్యక్షుడు గురు మోహన్ ప్రధాన కార్యదర్శి ధన శేఖర్, గాలి మహేష్, ఏఎంసి డైరెక్టర్ గోల కిషోర్ నాయుడు, ఐటీ వింగ్ రమణారెడ్డి, కిరణ్, రాఘవేంద్ర బాలు జనసేన పార్టీ నాయకులు శనివారం ఏపీఐఐసీ డైరెక్టర్ మైఫోర్స్ మహేష్ పీలేరు నియోజకవర్గంలోని తాటిగుంటపల్లి, పీలేరులో ఉన్నటువంటి ఇండస్ట్రియల్ పార్క్లు ఎంఎస్ఎమీ పార్క్ సందర్శించి పారిశ్రామికవేత్తలతో చర్చించి అక్కడ ఉన్న సమస్యల తెలుసుకొని త్వరలోనే అన్ని రోడ్లు కాలువలు, మౌలిక సదుపాయాలు కల్పించి పారిశ్రామికకు అండగా నిలుస్తామని తెలియజేశారు. సుమారు 1300 ఎకరాలతో ఇండస్ట్రియల్ పార్క్ ప్రజలకి అందుబాటులో ఉంటూ పీలేరు నియోజకవర్గం ఇండస్ట్రియల్ హబ్ గా తీర్చిదిద్దేందుకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించి సింగల్ డెస్క్ విధానంలో అన్ని రకాల అనుమతులు ఇవ్వడం జరుగుతుందని ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకొని కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్ప్రెనేర్ అనే నినాదంతో ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్తని సిద్ధం చేయాలని కూటమి ప్రభుత్వ లక్ష్యాన్ని ప్రజలందరూ కూడా సద్వినియం చేసుకొని తద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి తోడ్పడాల్సిందిగా కోరుతున్నానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి కలప రవి, తదితర జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## చౌడేపల్లి పీడీవోగా ప్రకాష్ రెడ్డి బాధ్యతలు



చౌడేపల్లి, జూలై 18, ప్రభాతవార్త : మండల కేంద్రమైన, మేజర్ పంచాయతీ అయినటువంటి చౌడేపల్లి నూతన పంచాయతీ అభివృద్ధి అధికారిగా రెడ్డి వారి ప్రకాష్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం ఆయన స్థానిక పంచాయతీ కార్యాలయంలో అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు గంగవరం మండలం, గండరాజుపల్లిలో పిడిఓగా విధులు నిర్వహించిన ఆయన, బదిలీపై చౌడేపల్లికి వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. పంచాయతీ పరిధిలోని ప్రజలందరూ అన్ని విధాలా సహకరించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు నూతనంగా బాధ్యతలు చేపట్టిన పిడిఓ ప్రకాష్ రెడ్డికి స్థానిక పంచాయతీ సిబ్బంది, పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలియజేశారు.

## జగన్ 2.0 సూపర్ యాప్ పోస్టర్ల ఆవిష్కరణ



తంబళ్లపల్లె జూలై 18 ప్రభాతవార్త ః తంబళ్లపల్లె మండల కేంద్రంలో శనివారం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఆదేశాల మేరకే జగన్ 20 సూపర్ యాప్ పోస్టర్ ను స్థానిక వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్యకర్తలకు పార్టీని మరింత పటిష్టం చేసే ఆధునిక డిజిటల్ వేదిక, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడం, ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకోవడం, ఈ సమాచారాన్ని వేగంగా అందించడానికి ఈ సూపర్ యాప్ ఉపయోగపడుతుందన్నారు. కార్యకర్తలు ఈ డిజిటల్ సూపర్ యాప్ ద్వారా అధిష్టానంతో నిత్యం అందుబాటులో ఉండే పార్టీని బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ యాప్ ను వైకాపా నాయకులు, కార్యకర్తలు, సద్వినియోగం చేసుకుని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయపతాన నడపడానికి ప్రతి కార్యకర్త కలిసి రావాలని సూచించారు.

## షైనింగ్ స్టార్స్ అవార్డుకు ఆరుగురు విద్యార్థులు ఎంపిక

వాల్మీకిపురం, జూలై 18 ప్రభాతవార్త: రాష్ట్రప్రభుత్వం ఆధ్వర్యంలో 2026 ఎస్ఎస్సి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన ఆరుగురు విద్యార్థిని, విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డులకు ఎంపికైనట్లు ఎంఈవో వెంకటరత్నం శనివారం తెలిపారు. స్థానిక బాలికల జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన షేక్ షాహీన్నాజ్ ప్రభుత్వ పీవీసీ ఉన్నత పాఠశాలకు పటాన్ అఫ్సానా, ఏపీ మైనార్టీ ఉర్దూ గురుకుల పాఠశాలకు చెందిన చరిస్మా, స్వాతంత్ర భారతి ఇంగ్లీష్మీడియం స్కూలుకు చెందిన రష్మికుమారి, విశ్వమైత్రి ఇంగ్లీష్ మీడియం స్కూల్కు చెందిన హేమశ్రీ, మహమ్మద్ యాసీర్లు షైనింగ్ స్టార్స్ అవార్డులకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ ఎంపికైన విద్యార్థులకు ఈనెల 20వతేది సోమవారం జిల్లా కేంద్రమైన మదనపల్లెలో ఎన్ జె ఆర్ కళ్యాణమండపంలో జరిగే ఒక ప్రభుత్వ కార్యక్రమంలో రూ.20 వేల నగదు, ప్రశంసాపత్రంతో పాటు పథకాన్ని అందజేయనున్నట్లు ఎంఈవో తెలిపారు షైనింగ్ స్టార్స్ అవార్డులకు ఎంపికైన విద్యార్థులకు మండల ఉపాధ్యాయులు, సహచర విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.

## దళిత వెట్టిచాకిరి విముక్తి దినము కార్యక్రమం



పీలేరు,జూలై 18, ప్రభాతవార్త: ఐక్య దళిత మహానాడు జాతీయ అధ్యక్షులు కల్లూరు చెయ్యగారి మరియు. ప్రొఫెసర్ బి.మురళీధర్ ఆధ్వర్యంలో దళిత వెట్టి చాకిరి విముక్తి దినము సమావేశమును తిరుపతిలో ఘనంగా నిర్వహించినారు. యూనివర్సిటీలోలా విద్యార్థుల సమక్షంలో ఘనంగా నిర్వహించినారు. ప్రొఫెసర్ మురళీధర్ మాట్లాడుతూ గతంలో దళితులు మరియు బడుగు బలహీన వర్గాల ప్రజల దగ్గర అగ్రకులస్తులు ఎలా వెట్టి చాకిరీ చేయించుకున్నారు లా విద్యార్థులకు వివరంగా చెప్పడం జరిగింది అలాగే కల్లూరు చంగయ్య గారు మాట్లాడుతూ దళిత ముద్దుబిడ్డలు లా కోర్సును పూర్తి చేసుకుని లాయర్లుగా ఉన్నతమైన స్థానాలలో ఉండి బడుగు బలహీన వర్గాల ప్రజలను ఆదుకోవాలని వారికి దళిత లాయర్లుగా మీ వంతు సహాయం చేయాలని ఈ సందర్భంగా కోరారు.సిఐటియు రాష్ట్ర కార్యదర్శి చిన్న ఎల్లప్ప రాష్ట్ర మాల మహానాడు అధికార ప్రతినిధి విహారి జిల్లా విద్యార్థి విభాగ ఉపాధ్యక్షుడు మాల తోట నరేష్ శ్యాముల్ విజయ్ మురళి పాల్గొన్నారు.

## పాత కక్షలతో టిడిపి నాయకుడి పై దాడి



పెద్దమండెం జూలై 18 ప్రభాతవార్త మండలంలోని పాపయ్యపల్లి పంచాయతీ మల్లప్ప నాయుడు కాలనీకి చెందిన టిడిపి కార్యకర్త డి రామచంద్ర పై శుక్రవారం వైసీపీ నాయకులు దాడి చేశారు అనంతరం తన ఎడమ చెవిని కొరికేశారు. వివరాల్లోకి వెళితే రామచంద్ర పెంపుడు కుక్క తన ఇంటి పక్కన ఉన్న మాదారపు శంకరయ్య ఇంటిలోకి వెళ్లి అన్నం తినిందని మూడు రోజుల క్రితం గొడవ పడ్డారు దీంతో శుక్రవారం కుక్కను ఇంట్లో కట్టేసి కూలీ పనులకు బయలుదేరు సమయంలో శంకర చలపతి చంద్రశేఖర భూదేవి వెంకటలక్ష్మిలో ముకుమ్మడిగా దాడి చేసి కొట్టారు అనంతరం రామచంద్ర ఎడమ చెవిని కొరికే సారు గతంలో పాపేపల్లి కుర్లవానికుంట రోడ్డుపై ఉపాధి హామీ పథకంలో కాలువపై కల్వర్టు నిర్మించారు. గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు కాలువపై ఇంటి నిర్మాణం చేశాడు ఈ విషయంగా పలుమార్లు రెవెన్యూ పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేసిన సమస్య పరిష్కారం కాలేదు కాలువపై ఇంటి నిర్మాణం చేపట్టడంతో కాలువ పూడి నీళ్లు ఇంటిలోకి వస్తుండడంతో సదరు రామచంద్ర పిజిఆర్ కింద ఫిర్యాదు చేశారు అది మనసులో పెట్టుకుని కుక్క ఇంటిలో దూరి అన్నం తిన్న దన్న సాకుతో తనపై దాడి చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. చికిత్స నిమిత్తం స్థానిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స కోసం వెళ్ళాడు అక్కడ సాధ్యం కాదని మదనపల్లి ఏరియాకు వెళ్లాలని సూచించారు దీంతో మదనపల్లిలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో చెవికి చికిత్స చేసుకొని ఆరు కుట్లు పడినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసి సమస్య పరిష్కరించాలని విన్నవించాడు.

## తంబళ్లపల్లెలో స్వచ్ఛ ఆంధ్రస్వచ్ఛ దివస్ ర్యాలీ



తంబళ్లపల్లె జూలై 18 ప్రభాతవార్త ః తంబళ్లపల్లె మండల కేంద్రంలో శనివారం ఎంపీడీవో ఉషారాణి ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్రస్వచ్ఛ దివస్ కార్యక్రమం పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పారిశుద్ధంపై దృష్టి సారించాలని, ప్లాస్టిక్ నిషేధంతో పాటు, పర్యావరణ పరిరక్షణ, నీటి సంరక్షణ తదితర అంశాలను పాటించాలని అధికారులు, నాయకులు, ప్రజలు, విద్యార్థుల చేత ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లు ప్రసాద్, మారుతి కుమార్, ఏపీ ఎం గంగాధర్, ఏపీవో అంజనప్ప, విఆర్ఓ వెంకట్ రమణ, లైన్ ఇన్స్పెక్టర్ భాస్కర్, కార్యదర్శి మహబూబ్ బాషా, పద్మావతి, భాస్కర్, అధికారులు, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## టమేటా మండీలకు వేలంపాటలు నిర్వహిస్తాం

కురబలకోట జూలై 18 ప్రభాతవార్త. కురబలకోట గ్రామపంచాయతీ పరిధిలోని ఆర్ఓబి వద్ద అనుమతి లేని ప్రైవేట్ టమేటా మండీల కు వేలం పాటలు నిర్వహించేందుకు మదనపల్లి డి ఎల్ పి ఓ కు ప్రతిపాదనలు పంపినట్లు కురబలకోట గ్రామ స్పెషల్ ఆఫీసర్ బాలమూర్తి తెలిపారు. కుర బలకోట గ్రామపంచాయతీ పరిధిలోని ఆర్ఓబి వద్ద అనుమతి లేకుండా టమాటా మండీలు నిర్వహించడం వల్ల గ్రామపంచాయతీకి ఎలాంటి ఆదాయము రాకపోగా దీనిపై పలువురు ఫిర్యాదులు చేయడంతో వేలంపాటి నిర్వహించేందుకు అనుమతి కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతున్నట్లు ఆయన తెలిపారు. వేలంపాట నిర్వహణకు అనుమతి వచ్చిన వెంటనే వేలం పాటలు నిర్వహించి స్థానిక గ్రామపంచాయతీకి ఆదాయం వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

## కళాశాల ప్రాంగణ పరిశుభ్రత అందరి బాధ్యత

### ప్రిన్సిపాల్ డా. కె. వెంకట సుబ్బారెడ్డి



బద్వేలు, జూలై 18, ప్రభాతవార్త కళాశాల ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి విద్యార్థి, అధ్యాపకుడు, సిబ్బంది బాధ్యత అని శ్రీ బిజివేముల వీరా రెడ్డి డిగ్రీ కళాశాల ప్రిన్సి పాల్ డా. కె.వెంకట సుబ్బారెడ్డి పేర్కొన్నారు. కళాశాలలో ఎస్ఏఎస్ఏ నోడల్ అధికారి సి.హెచ్. ఈశ్వరయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తంగతి గదులు, ప్రయోగశాలలు, కళాశాల ఆవరణ, మరుగుదొడ్లను ఎల్లప్పు డూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పరిశుభ్రత కార్యక్రమాల్లో విద్యార్థులు చురుకుగా పాల్గొని అపరిశుభ్రత వల్ల కలిగే వ్యాధుల నుంచి తమను తాము రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. నోడల్ అధికారి సి.హెచ్. ఈశ్వరయ్య మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, నీటి పైపుల లీకేజీలను వెంటనే మరమ్మతు చేయాలని సూచించారు. అలాగే డ్రైనేజీ కాలువల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొని పరిశుభ్రత కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## పులివెందుల మున్సిపల్ కమిషనర్‌గా తనూజ బాధ్యతలు స్వీకరణ

### మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యం



పులివెందుల,జూలై 18 , ప్రభాతవార్త : పులివెందుల మున్సిపల్ కమిషనర్‌గా మదనపల్లికి చెందిన ఎం. తనూజ శనివారం బాధ్యతలు స్వీకరించారు. గ్రూప్1 ద్వారా మొట్టమొదటి సారిగా పులివెందుల మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టడం తనకు ఎంతో సంతోషంగా ఉందని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ తనూజ మాట్లాడుతూ పులివెందుల మున్సిపాలి టీని ఆదర్శ మున్సిపాలి టీగా తీర్చిదిద్దడమే తన ప్రధాన ధ్యేయమని అన్నారు. మున్సిపాలిటీలో పనిచేస్తున్న సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ వారి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడ ఏ సమస్య ఉన్నా వెంటనే స్పందించి పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు మున్సిపాలిటీ అభివృద్ధికి అధికారులు, సిబ్బంది, ప్రజల సహకారం అవసరమని కమిషనర్ తనూజ పేర్కొన్నారు.

## యువత వ్యాయామాన్ని నిత్య జీవితంలో భాగంగా చేసుకోవాలి



ప్రొద్దుటూరు అర్బన్, జూలై 18 ప్రభాతవార్త

యువత వ్యాయామాన్ని నిత్య జీవితంలో భాగంగా చేసుకోవాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాయల్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని కొర్రపాడు రోడ్డులో రమణ మహర్షి స్కూల్ సమీపంలో ఏర్పాటు చేసిన టైటాన్స్ అరేనా స్ట్రెంత్ క్లబ్ ను శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా క్లబ్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే, యువత ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. టీడీపీ యువ నాయకులు నంద్యాల కొండారెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ఇలాంటి ఫిట్‌నెస్ కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. క్లబ్ నిర్వాహకులు పవన్ దత్తా రెడ్డి, కోట ప్రవీణ్, వినోద్ మాట్లాడుతూ విశాలమైన స్థలం, పార్కింగ్ సదుపాయం, ఆధునిక జిమ్ పరికరాలతో క్లబ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యుడు డాక్టర్ వరుణ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర టీడీపీ ప్రధాన కార్యదర్శి వి.ఎస్. ముక్తియార్, మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, కేఆర్‌సీ కెనాల్ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ద్వార్శల గురివిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, నంద్యాల ఆనంద్ భార్గవ్ రెడ్డి, మాజీ టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఈవీ సుధాకర్ రెడ్డి, రాజుపాలెం మండల టీడీపీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, అన్నవరం సుదర్శన్ రెడ్డి, బచ్చల ప్రతాప్, నంద్యాల హరినాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే గేటుతో ప్రజలకు తప్పని తిప్పలు

వాల్మీకిపురం, జూలై 18 ప్రభాతవార్త: మదనపల్లె తిరుపతి నాలుగవరసల రహదారి నుంచి వాల్మీకిపురానికి వెళ్లాలంటే మధ్యలో రైల్వేగేటు ఉంది. కొత్తగా నాలుగు వరసుల రహదారి ప్రారంభం అయినప్పటి నుంచి వాల్మీకిపురం నుంచి జాతీయరహదారికి వెళ్లాలంటే రైల్వేగేటు దాటుకునే వెళ్లాల్సి ఉంది. దీంతో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. రైల్వేగేటు పడినప్పుడుల్లా వాహన చోదకులు ఎండకు ఎండిపోయి 10 నుంచి 20 నిమిషాల పాటు నిరీక్షించాల్సి వస్తోంది. అయితే శనివారం ఉదయం రైలు వెళ్లే సమయానికి రైల్వే గేటును వేశారు. అయితే రైలు వెళ్లిపోయాక గేటు తెరిచేందుకు సాంకేతిక లోపం తలెత్తడంతో గేటు తెరవలేక రైల్వే గేట్ ను గంట పాటు నానా అవస్థలు పడాల్సి వచ్చింది. చివరకు రైల్వే సిబ్బందిని దీంతో ఎక్కడికక్కడ వందలాది వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్కు తీవ్ర అంతరాయం కలిగింది. రైల్వే అధికారులు చొరవ తీసుకుని రైల్వే బ్రిడ్జి నిర్మించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

## విద్యార్థులతో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ దివాస్ ర్యాలీ అవగాహన



రామసముద్రం జూలై 18, ప్రభాతవార్త : రామసముద్రం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు బిసి కాలనీ నుండి ర్యాలీ వచ్చి ఎంపిడివో కార్యాలయం లో మానవహారం నిర్వహించారు శనివారం స్వచ్ ఆంధ్ర స్వచ్ దివాస్ కార్యక్రమాన్ని ఎంపిడిఓ లతీఫ్ ఖాన్, ప్రిన్సిపాల్ చిట్టిబాబు పంచాయతీ సెక్రటరీ మునిస్వామి నాయక్, సిబ్బంది నిర్వహించారు. ఎంపిడిఓ కార్యాలయంలో అధికారులు కార్మికులు చీపురులు చేతబట్టి పారిశుధ్య పనులు చేపట్టారు.ఎంపిడిఓ, పంచాయతీ సెక్రటరీ మునిస్వామి నాయక్,జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ చిట్టిబాబు,లెక్చరర్లు విద్యార్థులు సిబ్బంది తో మానవహారం ఏర్పడి సిబ్బంది, ప్రతిజ్ఞ చేయించారు. వీరు మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ లతీఫ్ ఖాన్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చిట్టిబాబు పంచాయతీ సెక్రటరీ మునిస్వామి నాయక్, కాలేజీ లెక్చరర్లు, విద్యార్థులు,ఎంపిడిఓ కార్యాలయ సిబ్బంది,గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

## హార్టికల్చర్ హబ్ కు స్థల పరిశీలన చేసిన సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి



రామసముద్రం జూలై 18 ప్రభాతవార్త

రామసముద్రం మండలం చొక్కాండ్ల పల్లెలో హార్టికల్చర్ హబ్ కు ఏర్పాటుకు సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి శనివారం హార్టీ కల్చర్ హబ్ స్థల పరిశీలన చేసారు.మదనపల్లె నియోజక వర్గంలో ఒక హార్టికల్చర్ హబ్ ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ ఆలోచనకు అనువుగా రామసముద్రం మండలంలో హబ్ ఏర్పాటు సాధ్యాసాధ్యాలను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు ఆమె తెలిపారు.చొక్కాండ్ల పల్లె పంచాయతి కి చెందిన సర్వే నంబర్ 177 లో పశువుల మేతకు చెందిన 60 ఎకరాల భూమి ఉన్నట్లు తహశీల్దార్ మొహమ్మద్ అజారుద్దీన్ సబ్ కలెక్టర్ కు తెలిపారు .ఇందుకు సంబంధించిన మ్యాప్‌ను సబ్ కలెక్టర్ పరిశీలిచారు.అయితే 60 ఎకరాలను కొంత మంది రైతులు అనధికారికంగా సాగుచేస్తున్నారని విఆర్ఓ తెలిపారు.ఇందుకు సంబంధించి కొంతమంది రైతులను సబ్ కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఉన్నతాధికారుల అభిప్రాయం మేరకు హార్టికల్చర్ హబ్ ఏర్పాటు తగు చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ చల్ల కళ్యాణి, తాహిసీల్దార్ మహ్మద్ అజారుద్దీన్, ఆర్ ఐ వసీం, వి ఆర్ వో మహ్మద్ బాషా,హరి రెవిన్యూ సిబ్బంది గ్రామస్థులు హాజరయ్యారు.

## అంగరంగ వైభవంగా ప్రారంభమైన ఆషాడ మాస పూజా కార్యక్రమం



బద్వేలు, జూలై 18, ప్రభాతవార్త

బద్వేల్ నియోజకవర్గం గోపవరం మండలం వల్లేరవారి పల్లె గ్రామం లో వెలసిన స్వయంభు శ్రీ లక్ష్మినరసింహస్వామి దేవస్థానం నందు ఆషాడమాసం ప్రారంభంతో వైభవంగా హోమం అభిషేకం పూజా కార్యక్రమం నిర్వహించడం జరిగినది. తదుపరి స్వామి అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు మాట్లాడుతూ శ్రీ లక్ష్మి నరసింహ స్వామి కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో లోక కళ్యాణార్థం 20/07/2026 వ తేదీ సోమవారం ఉదయం 4:00 గంటలకు మహాపాదయాత్ర మొదలు అవుతుందనీ, ఈ పాదయాత్ర ముఖ్య ఉద్యేశం లోక కళ్యాణం,ధర్మ పరిరక్షణ, సకల జీవుల శ్రేయస్సు కోసమని వివరించారు.అలాగే ఆ లక్ష్మి నరసింహ స్వామికి నడిచి వచ్చి దర్శించు కున్న భక్తులకి స్వామి వారి యందు దయ చూసి వారికి ఉన్న అష్టకష్టాల ను తొలగించి వారికి అష్ట ఐశ్వర్యం లను ఇచ్చి ఆనందమును కోరిన కోరికలను ఇస్తారు అన్ని తెలిపారు, కావున భక్తులు అందరూ కూడా ఈ పాదయాత్ర లో పాల్గొని మీ కోరికలను స్వామివారికి విన్నపించుకుని సంపూర్ణ ఆశీర్వచనం పొందగలరని తెలియజేశారు,తదుపరి అన్నదాన కైంకర్యం నిర్వహించడం జరిగినది అన్నదాన కైంకర్యం నిర్వహించినవారు శ్రీ లక్ష్మినరసింహ స్వామి కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.

## చేలల్లో పాతిన పోళ్లకు ఉన్న ఇనుప కంచెను దొంగలు ఎత్తుకెళ్లారు

### రూ.లక్షల్లో నష్టం అంటూ రైతులు ఆవేదన..

లక్కిరెడ్డిపల్లి, జులై 18, ప్రభాతవార్త : రైతులు వారి పొలాల గట్ల చుట్టూ పాతుకున్న పూలకు వేసుకున్న ఇనుప కంచెను గుర్తు తెలియని దొంగలు అపహరించుకుపోయినట్లు రైతులు మద్దిరేవుల భాస్కర్ రెడ్డి, మద్దిరేవుల చెన్న కృష్ణారెడ్డి లు ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజుల క్రితం నేషనల్ హైవే కి కూతవేటు దూరంలో పొలాల గట్లకు వేసుకొని ఉన్న కంచెను గుర్తుతెలియని దొంగలు కత్తిరించుకు వెళ్ళినట్లు వారు తెలిపారు. దాదాపు ఇనుపకంచ విలువ ఒక్కో రైతుకు సంబంధించి రూ. రెండు లక్షల పై బడి ఉంటుందని వారు తెలిపారు. తీవ్ర కరువు పరిస్థితుల నెలకొన్న నేపథ్యంలో కంచె చేను మేసింది అన్న చందంగా దొంగల బెడద ఎక్కువైందని,, తమ చేనులకు వేసుకున్న కంచెను దొంగలించే స్థాయికి తెగబడ్డారంటే, పొలాల గట్ల మీద ఉండే రాళ్లు, పోలను కూడా ఎక్కడ తీసుకెళ్తారని భయాందోళన చెందుతున్నామన్నారు. ఈ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్లో రైతులు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ మధ్యకాలంలో బోరుబావులు వద్దన్న కేబుల్ వైర్ లోని కాపరువైరుకు తెగబడుతున్న దొంగలు ప్రస్తుతం చేలల్లో ఉన్న ఇనుప కంచకు కుడా ఎత్తుకెళ్లడానికి పాల్పడుతున్నారని వారు వాపోతున్నారు. వరుస దొంగతనాలతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు.



తమ పొలాల గట్లగున్న ఇనుపకంచెను దొంగలించినట్లు చూపెడుతున్న రైతు చిన్న కృష్ణారెడ్డి

## పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత

### వైద్యులు చంద్రశేఖర్ నాయక్



పీలేరు, జూలై 18, ప్రభాతవార్త: జలుబు, దగ్గు, జ్వరము, నీరసం లాంటి ఆరోగ్య సమస్యల్ని నిర్లక్ష్యం చేయక దగ్గర్లోని అర్హత కలిగిన వైద్య నిపుణులచే సత్వర ఉచిత ఆరోగ్య సేవలు పొందాలని పిహెచ్సి తలుపుల వైద్యాధికారులు చంద్రశేఖర్ నాయక్ అన్నారు. ఒంటిల్లు గ్రామంలో 104 ప్రభుత్వ ఉచిత ఆరోగ్య సేవల్లో భాగంగా ప్రజలకు "వ్యాధులు ఉధృతి నివారణ చర్యలు అంశముపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గ్రామీణ మహిళలతో బ్యానర్ సహకారంతో మాట్లాడుతూ ప్రజారోగ్యం పట్ల బాధ్యత వహిస్తూ అందరు విధిగా శుభ్రత కు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ఎప్పటికైనా మనం ఆచరించే మంచి అలవాట్లే మనవ మనుగడకు ఉపయోగపడ తాయని, దగ్గినప్పుడు తుమ్మినప్పుడు చేతులు గుడ్డ అడ్డుపెట్టుకోవడం, అవసరమైతే మాస్కులు ధరించడం, చేతులు శుభ్రత, పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత,ఇవి మన ఆరోగ్యానికి రక్షణ అని డాక్టర్ చంద్రశేఖర్ వంటిల్లు గ్రామీణ ప్రజలకి బ్యానర్ల సహాయముతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ హెచ్ఇఓ కొండయ్య, ఏఎన్ఎం వసుంధర, సిహెచ్ఓ నాగము త్యం,ధరణి సంఘమిత్ర గౌసియా, ఆశా కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

## తంబళ్లపల్లె కార్యదర్శిగా మహబూబ్ బాషా



తంబళ్లపల్లె జూలై 18 ప్రభాతవార్త ః తంబళ్లపల్లె గ్రేడ్1 కార్యదర్శిగా ఎస్ మహబూబ్ బాషా శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన పలమనేరు నియోజకవర్గం గంగవరం మండలం గుండుగల్లు గ్రేడ్2 కార్యదర్శిగా పనిచేస్తూ పదోన్నతి పై తంబళ్లపల్లె పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టాడు. తంబళ్లపల్లె పంచాయతీ అభివృద్ధి చేయడానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు, అధికార పార్టీ నాయకుల సహకారంతో కృషి చేస్తానన్నారు. ఆయనను ఎంపీడీవో ఉషారాణి, డిప్యూటీలు ఎంవి ప్రసాద్, మారుతీకుమార్ లు అభినందించి పంచాయతీ ఆదాయ వనరులు పెంపుతో పాటు అభివృద్ధి, మౌలిక సదుపాయాలపై దృష్టి సారించాలని సూచించారు.కోసువారిపల్లి కార్యదర్శి శ్రీనివాసరావు, సిబ్బంది సోమ శేఖర్ రెడ్డి, పద్మావతి, భాస్కర్, మస్తాన్, మనోహర తదితరులు అభినందించి ఘనంగా స్వాగతించారు.

## మదనపల్లె నవోదయలో ముగిసిన క్లస్టర్ స్థాయి విజ్ఞాన ప్రదర్శన



మదనపల్లె క్రైం, జూలై 18 ప్రభాతవార్త.

జవహర్ నవోదయ విద్యాలయంలో రెండు రోజుల పాటు ఉత్సాహంగా సాగిన క్లస్టర్ స్థాయి విజ్ఞాన ప్రదర్శన పోటీలు శనివారం ఘనంగా ముగిశాయి. ఈ ప్రదర్శనలో వివిధ నవోదయ విద్యాలయాలకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన 59 సైన్స్ నమూనాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించిన విశ్రాంత వైస్ ప్రిన్సిపాల్స్ రెడ్డప్ప, సుబ్రహ్మణ్యం విద్యార్థుల ప్రతిభను అభినందించారు. అనంతరం విద్యాలయ ప్రిన్సిపాల్ ఎం. గీత విద్యార్థుల పోటీ తత్వాన్ని ప్రశంసిస్తూ, వివిధ అంశాలలో ప్రతిభ కనబరిచిన 16 మంది విజేతలకు ప్రథమ, ద్వితీయ బహుమతులను అందజేశారు.నివేదిత కన్వర్ (అనంతపురం), జస్వంత్ (ఒంగోలు), సాయి సుహారిక (కర్నూలు), దీపిక (కడప). క్రితిక (కరేకల్ ), చెన్నకేశ వరావు (ఒంగోలు), శివరాం (కర్నూలు ప్రథమ), నాగ సాయి (మార్కాపురం ద్వితీయ). కీర్తన శ్రీ (మదనపల్లె), సుజిత్ (ఒంగోలు). కుశల్ కుమార్ (మదనపల్లె), జాస్మిర్ (కడప). దివ్యశ్రీ (మదనపల్లె), సాయి వర్షిణి (కర్నూలు). నివేదిత (అనంతపురం), యుక్త ప్రియ (మదనపల్లె) విజేతలుగా నిలిచారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతి సాధించిన విజేతలు ప్రాంతీయ (రీజనల్) స్థాయి పోటీల్లో పాల్గొంటారు. కార్యక్రమంలో విద్యాలయ సిబ్బంది జగదీష్ కుమార్, శైలజ, శారద, వెంకటేశులు, సుమతి, శ్రీకృష్ణ, రామలక్ష్మి, చంద్రశేఖర రెడ్డి, కౌన్సిలర్ శంకరప్ప తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## రాయలసీమ అభివృద్ధిపై కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు




బద్వేలు, జూలై 18, ప్రభాతవార్త రాయలసీమ ప్రజల అభివృద్ధి పట్ల కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యుడు ఎస్.చంద్రశేఖర్ విమర్శించారు. శనివారం భగత్ సింగ్ నగర్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.పట్టిసీమ పూర్తి చేయడంపై ఉన్న శ్రద్ధ రాయలసీమ ఎత్తిపోతల పథకంపై లేదని, ఇదే ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. సంవత్సరానికి 100 టీఎంసీల లక్ష్యంతో 4000 కోట్లతో ప్రారంభమైన రాయలసీమ ఎత్తిపోతల పథకం అర్ధాంతరంగా ఆగిపోయిందని, అడ్డంకులు తొలగించి నిధులు విడుదల చేసి త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రాయలసీమ ఎత్తిపోతల, బ్రహ్మసాగర్, హంద్రీనీవా, గాలేరు నగరి ప్రాజెక్టులకు తక్షణ నిధులు విడుదల చేయాలనీ, బ్రహ్మంగారిమఠం తరహాలో బద్వేల్ నియోజకవర్గ భూములను ప్రత్యేక టీములతో సర్వే చేసి ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలనీ, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి 3 ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయించాలని తదితర డిమాండ్లు చేశారు.ఇటీవల చేపట్టిన "ఒక నియోజకవర్గం నాలుగు పర్యటనల" కార్యక్రమం వల్ల ప్రజలకు ఒరిగిందేమీ లేదని, 700కి పైగా ఫిర్యాదులు వచ్చినా 60 70 మందికే ఎన్ఓసీలు ఇచ్చి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. రాయలసీమ ప్రజలు కూటమిని గెలిపించారని, హామీలు నిలబెట్టుకోకపోతే 2019 ఎన్నికల్లో జరిగిన ఘోర పరాజయం తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యుడు కె.జకరయ్య, నియోజకవర్గ కమిటీ సభ్యులు రామరాజు, విజయరావు, సంజీవరాయుడు, గంటా మహబూబ్ బాషా, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఆదర్శంగా నిలవాలి

మొదటి పేజీ తరువాయి



పరిశుభ్రతను కేవలం ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా భావించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ప్రజలకు పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్రజలందరూ నిరంతరం భాగస్వాములై అన్నమయ్య జిల్లాను పరిశుభ్రత, పచ్చదనం, పర్యావరణ పరిరక్షణలో ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ యామిని, రాయచోటి మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, మున్సిపల్ సిబ్బంది, ప్రభుత్వ అధికారులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, ప్రజలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు విజయానికి మెట్టు

### ఆదిత్య కళాశాల డైరెక్టర్ డాక్టర్ రామలింగారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

**మదనపల్లె, జులై 18 ప్రభాతవార్త :**
విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, సమర్థవంతమైన కమ్యూనికేషన్ ఉంటే విజయానికి మార్గమంటూ ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్. రామలింగారెడ్డి తెలిపారు. శనివారం కళాశాలలో హ్యూమన్‌రైట్స్ అండ్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ఏసిఈఎం లీడర్స్ కాన్‌క్లేవ్ ద్వారా విద్యార్థుల సక్సస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు కమ్యూనికేషన్స్, బృందా సహకారం, నిర్ణయాత్మకత, వ్యక్తిత్వ వికాసం, భవిష్యత్తు వృత్తి, జీవితానికి అవసరమైన నైపుణ్యాలను పెంపొందించడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు. నాయకత్వం అనేది కేవలం ఒక్క పదవి కాదని సమాజంపై సానుకూల ప్రభావం చూపే బాధ్యతతో కూడిన లక్ష్యం అన్నారు. విద్యార్థులు విద్యతో పాటు నాయకత్వం, క్రమశిక్షణ, సేవాభావం, నైతిక విలువలను అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వహించిన లీడర్‌షిప్‌సెషన్లు, ఇంట్రాక్టూ చర్చలు, గ్రూప్ యాక్టివీటీలు, ప్రేరణాత్మక ప్రసంగాలు విద్యార్థులను ఆకట్టుకొన్నాయి. ప్రిన్సిపాల్ డాక్టర్ రాముడు, డీన్ విభాగాదిపతులు, ప్లేస్‌మెంటు సెల్ క్వాంటమ్ అండ్ ఇంగ్లీష్ క్లబ్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. కళాశాల యాజమాన్యం, కరస్పాండెంట్ ఆర్.రామ్మోహన్‌రెడ్డి, ప్రెసిడెంట్ నాగమల్లారెడ్డి, విభాగాదిపతులు విద్యార్థులు సమాజానికి ఆదర్శనాయకులుగా ఎదగాలని సూచించారు.

## వర్షాభావంలో ఉల్లి పంటకు సస్యరక్షణ చర్యలు పాటించాలి

### - ఉద్యాన శాఖ అధికారి మల్లేశ్వరరెడ్డి



**ముద్దనూరు, జూలై 18 (ప్రభాతవార్త):**
ఎల్‌నీనో ప్రభావంతో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల్లో ఉల్లి రైతులు తగిన శస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యాన శాఖ అధికారి మల్లేశ్వరరెడ్డి సూచించారు. ముద్దనూరు మండలంలో శనివారం రాఘవాపురం, తిమ్మాపురం, రాజుగురువాయపల్లి, ఉప్పలూరు గ్రామాల్లో ఉల్లి పంటను పరిశీలించిన ఆయన, నీటి పొదుపు కోసం డ్రిప్, సూక్ష్మ సేద్య పద్ధతులను వినియోగించాలని తెలిపారు. మొక్కల ఒత్తిడి తగ్గించేందుకు లీటరు నీటికి ఒక గ్రాము థయో యూరియా లేదా ఏడు గ్రాముల పొటాషియం నైట్రేట్ కలిపి పిచికారీ చేయాలని సూచించారు. భూమిలో తేమ నిల్వ ఉండేందుకు ప్లాస్టిక్ మల్చింగ్ షీట్లను ఉపయోగించాలని, రసం పీల్చే పురుగులు, పర్పుల్ బ్లాచ్ వ్యాధి నివారణకు ప్రొపినెబ్ లేదా పైరాక్లోస్ట్రోబిన్‌తో పాటు ఫిప్రోనిల్ పిచికారీ చేయాలని తెలిపారు. శాస్త్రీయ పద్ధతులు పాటిస్తే వర్షాభావంలోనూ ఉల్లి పంటను నష్టాల నుంచి కాపాడుకోవచ్చని పేర్కొన్నారు.

## జగన్ 2.0ఖి సూపర్ యాప్ ఆవిష్కరించిన రాచమల్లు



**ప్రొద్దుటూరు, జులై 18, ప్రభాతవార్త**
రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పాలన వల్ల ప్రజలు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలు, అన్యాయాలను నేరుగా నమోదు చేసుకునే వేదికగా ఖిజగన్ 2.0 సూపర్ యాప్ఖి ఉపయోగ పడుతుందని వైఎస్సార్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి తెలిపారు. శనివారం తన నివాసంలో ఆయన వైసీపీ శ్రేణులతో కలిసి యాప్‌కు సంబంధించిన గోడ పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, దాడులు, అత్యాచార ఘటనలు, అలాగే వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలపై నమోదైన అక్రమ కేసులు, అరెస్టుల వివరాలను ఈ యాప్ ద్వారా నమోదు చేయాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి సమస్యను పార్టీ దృష్టికి తీసుకువచ్చి, భవిష్యత్తు లో వైఎస్సార్సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. పార్టీ శ్రేణులు ప్రజల సమస్యలను గుర్తించి యాప్‌లో నమోదు చేయడం ద్వారా బాధితులకు అండగా నిలవాలని కోరారు. జగన్ 2.0 సూపర్ యాప్ పార్టీ కార్యకర్తలు, ప్రజలకు మధ్య అనుసంధాన వేదికగా పని చేస్తుందని, ప్రజా సమస్యల పరిష్కారానికి ఇది ఉపయోగపడుతుందని రాచమల్లు వివరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నిజాయితీ చాటుకొన్న ఆర్టీసి డ్రైవర్ శంకర్

### అభినందించిన అధికారులు, ప్రయాణీకులు



**మదనపల్లె, జులై 18 ప్రభాతవార్త :**
ఆర్టీసి డ్రైవర్ ఎంఎస్.శంకర్ తన నిజాయితీ చాటుకొని ఉన్నతాధికారుల నుంచి శభాష్ అనిపించుకొన్నాడు. కడప జిల్లా రాజంపేట ఆర్టీసి డిపోకు చెందిన బస్సు శుక్రవారం రాత్రి బెంగుళూరు నుంచి మదనపల్లె మీదుగా రాజంపేటకు వెలుతోంది. బెంగుళూరు నుంచి ఓ ప్రయాణీకురాలు మదనపల్లెకు వస్తూ తన విలువైన సెల్‌ఫోన్ సీట్‌లోనే మరిచిపోయి మదనపల్లెలో బస్సు దిగింది. ఇంటికి వచ్చి సెల్‌పోన్‌ను తన బ్యాగులో చూడగా సెల్‌ఫోన్ బస్సులోనే మరిచిపోయినట్లు గమనించి కుటుంబసభ్యులకు తెలిపింది. కుటుంబసభ్యులు మదనపల్లె ఆర్టీసి డిపో ఎంక్వైయిరీలో డ్రైవర్ ఎంఎస్.శంకర్ ఫోన్‌నెంబర్ తీసుకొని ఫోన్ చేసి సెల్‌ఫోన్ విషయంపై విచారించంగా సెల్‌ఫోన్ బస్సులోనే ఉన్నదని తన వద్ద భద్రంగా ఉంచుకొని మీకు చేర్చుతానని హామీ ఇచ్చాడు. శనివారం ఉదయం చెప్పిన ప్రకారం డ్రైవర్ సెల్‌పోన్‌ను ప్రయాణీకులకు అప్పగించాడు. డ్రైవర్ నిజాయితీని ఆర్టీసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళగా అతనిని ప్రత్యేకంగా అభినందించారు.

## కొనసాగుతున్న అన్నదానం

**ప్రొద్దుటూరు జూలై 18 ప్రభాతవార్త**
ప్రొద్దుటూరు పట్టణంలో టిడిపి పట్టణ అధ్యక్షులు చల్లా రాజగోపాల్ యాదవ్ ఆధ్వర్యంలో గత ఐదేళ్లుగా అన్నదానం కొనసాగుతున్న సంగతి తెలిసిందే అందులో భాగంగా శనివారం స్థానిక పాత బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని చల్లా రాజగోపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సుమారు వెయ్యి మంది అన్నదాన కార్యక్రమంలో పాల్గొని తమ సంతృప్తిని వ్యక్తం చేశారు. గత ఐదేళ్లుగా ప్రతి శనివారం మరియు ప్రతి పౌర్ణమి రోజున ప్రొద్దుటూరు పట్టణంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్విరామంగా కొనసాగిస్తున్న చల్లా రాజగోపాల్ యాదవ్ అభినందనీయుడని ప్రశంసలు కురిపించారు ఈ అన్నదాన కార్యక్రమం పట్టణంలోని నిరాశ్రయులకు పాదచారులకు పేద ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉందని వారు ఆకాంక్షించారు భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేసి ప్రజల మన్ననలు పొందాలని వారు ఆకాంక్షించారు. అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగించేందుకు అమ్మవారు ఆశీస్సులు నిత్యం చల్లా రాజన్నకు ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో చల్లా రవిశంకర్ యాదవ్ మూరబోయిన శ్రీనివాస యాదవ్ నల్లం రవిశంకర్ బంగి శివ ప్రసాద్ జయ చంద్ర యేసునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## నీటి ఎద్దడి, పారిశుద్ధ్యం నివారణలో వైఫల్యం

### వైకాపా ఇన్‌చార్జ్ నిస్సార్‌అహ్మద్



**మదనపల్లె, జులై 18 ప్రభాతవార్త :**
పట్టణంలో నీటి ఎద్దడి నివారణ, పారిశద్ధ్యం, వీధిదీపాల ఏర్పాట్లలో కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందిందని వైకాపా నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిస్సార్‌అహ్మద్ తెలిపారు. శనివారం వైకాపా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో కరువుపేరుతో నీటి ట్యాంకర్లు ఏర్పాట్లు చేసి దోపిడికి యత్నిస్తొందన్నారు. ప్రత్యేక అధికారుల పాలనలో వీటిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. పట్టణంలో ఆర్టిఫిషియల్ నీటి కొరత సృష్టించి ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా పేరుతో దోపిడి చేయడానికి తెర లేపారని విమర్శించారు. భూగర్భజలాలు అడుగంటిన బోర్లల్లో డీపింనింగ్ చేసి నూతన బోర్లు డ్రిల్ చేసి నీటిఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. గత వైసిపి పాలనలో నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ట్యాంకర్లు ఏర్పాటు చేయకుండా నీటి సరఫరా చేసి ప్రజాధనం వృధా కాకుండా అరికట్టడం జరిగిందన్నారు. ఇక పారిశుద్ధ్యం అధ్వాన్నంగా ఉందన్నారు. వీధి దీపాలు వెలగక పట్టణం అందకారంలో ఉందన్నారు. మున్సిపల్ ప్రత్యేక అధికారి, జిల్లా కలెక్టర్ స్పందించి ప్రైవేటు ట్యాంకర్ల నీటిసరఫరాపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

## ఏఐటియూసి రాష్ట్ర వర్కింగ్ సభ్యునిగా సాంబశివ



**మదనపల్లె, జులై 18 ప్రభాతవార్త :**
ఏఐటియూసి రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యునిగా సాంబశివ ఎన్నికయ్యారు. విజయవాడలో జరిగిన రాష్ట్ర సమావేశంలో అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఉన్న సాంబశివను రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యునిగా ఎన్నుకొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, కార్మిక వ్యతిరేక విధానాల రుద్ద కోసం ఏఐటియూసి ఆధ్వర్యంలో కృషి చేస్తానన్నారు. జిల్లాలో ఏఐటియూసిని మరింత బలోపేతం చేస్తానన్నారు. ఆయన ఎంపికపై పలువురు ఆయనను అభినందించారు.

## ప్రభుత్వ ప్రాథమికోన్నత పారశాల తనిఖీ



**ఒంటిమిట్ట జూలై 18 ప్రభాతవార్త**
మండలం గంగ పేరూరు పంచాయతీ చిన్న కొత్తపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల, అంగన్వాడి కేంద్రాన్ని ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి శనివారం తనిఖీ నిమిత్తం ఆ గ్రామానికి రావడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలోని విద్యార్థుల రిజిస్టర్, పాఠశాల, అంగన్వాడి కేంద్రం వాతావరణాన్ని క్షుణ్ణంగా పరిశీలించాడు. అంగన్వాడి కార్యకర్తతో పిల్లల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మరుగుదొడ్లు సక్రమంగా లేకపోవడంతో త్వరగా మరమ్మతులు చేయించాలని సూచించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా నిర్వహించాలని రుచికరమైన భోజనం తయారుచేసి పిల్లలకు వడ్డించాలన్నారు. విద్యార్థుల సంఖ్య పెంచాలని పాఠశాల అధ్యాపకులకు, సిబ్బందికి తెలియజేశారు. అదేవిధంగా గ్రామంలోని ప్రజలకు పాఠశాల అభివృద్ధి నిమిత్తం సలహాలు సూచనలు ఇచ్చి పాఠశాలకు వచ్చేందుకు విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెంచాలని తమ వంతుగా బాధ్యతలు నిర్వర్తించాలని సూచించారు. పాఠశాలకు వెళ్లేందుకు సక్రమమైన రహదారి లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని కావున రహదారి మార్గం వేయాల్సిందిగా గ్రామంలోని మహిళలు ఆయనకు తెలియజేశారు. స్పందించి వీలైనంత తొందరగా రహదారి మార్గాన్ని ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు కొత్తపల్లి బొబ్బిలి రాయుడు, వెంకటరమణ, అయ్యావారయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## ప్రసన్న వెంకటేశ్వర స్వామికి పూజలు..



**సుండుపల్లె, జూలై 18,ప్రభాతవార్త :**
మండల పరిధిలోని ఎన్ జె ఆర్ కాలనీ ఆరోగ్యపురములో వెలసిన శ్రీ శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవాలయము నందు ఈరోజు స్వామివారికి అభిషేకము పూల అలంకరణ తులసి మాల అలంకరణ అనంతరం దీప దీపం నైవేద్యం సమర్పించి మహా హారతి ఇవ్వడం జరిగినది అలాగే ఆలయంలో ఉన్నటువంటి మహాగణపతి స్వామివారికి గరుడ స్వామి వారికి అభయస్థఆంజనేయ స్వామి వారికి తులసి మాత అమ్మవారికి పూల అలంకరణ అనంతరం భూపతి దీప నైవేద్యం సమర్పించి మహా హారతి ఇవ్వడం జరిగినది వచ్చిన భక్తులు తల లీలలు సమర్పించుకున్నారు వారికి గోత్రనామాలతో మంత్రం చేసి ఆశీర్వాద వచనాలు ఇచ్చి వారికి తీర్థ ప్రసాదం ఇవ్వడం జరిగిందని అర్చక స్వామి అమృనాయక్ తెలియజేసాడు.

## స్మార్ట్ కిచెన్ పనుల పరిశీలన

**సిద్ధవటం, జూలై 18 ప్రభాతవార్త**
మండల కేంద్రమైన సిద్ధవటం లో నూతనంగా నిర్మాణ పనులు చేపట్టిన స్మార్ట్ కిచెన్ భవన నిర్మాణ పనులను శనివారం పంచాయతీ రాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామచంద్రనాయక్ పరిశీలించారు స్మార్ట్ కిచెన్ సెంటర్ భవనం చుట్టూ కాంక్రీట్ రేకుల షెడ్డు పనులు కొత్తగా నిర్మించబోయే కాంపౌండ్ వాల్ కు ఎస్టిమేషన్ తయారుచేసి పంపించాలని అధికారులకు తెలిపారు ఈ కార్యక్రమంలో డి ఈ శ్రీనివాసులు పిఆర్ ఏఈ, నాగరాజు రిటైర్డ్ వర్క్ ఇన్స్పెక్టర్ అతికారి రమణయ్య పాల్గొన్నారు.



## ఆరోగ్యకర భవిష్యత్‌ని తీర్చిదిద్దాలి



**వేంపల్లె జూలై 18 ప్రభాతవార్త**
పరిసరాల పరిశుభ్రత తో ఆరోగ్యకర భవిష్యత్‌ని తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాల్సిన అవసరం ఉందని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఉష్శ్రీ వెల్లడించారు. శనివారం స్వర్ణాంధ్ర..స్వచ్ఛాంధ్ర పై విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత ద్వారా ఆరోగ్యకరమైన జీవితాన్ని బాటలు వేయవచ్చన్నారు. ప్రతి విద్యార్థి వారంలో కనీసం ఒక గంట సమయాన్ని పరిశుభ్రతకు కేటాయించి.. శుభ్రతకు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్లాస్టిక్ వాడకాన్ని క్రమేణ తగ్గించి, వాతావరణ పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నాగేంద్ర, అధ్యాపకులు సతీష్, హరిత, హజీయ, రాజారెడ్డి, పీడీ తేజేంద్ర, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల గుండంలో జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల



**వేంపల్లె జూలై 18 ప్రభాతవార్త**
వేంపల్లెలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో డైనింగ్ హాల్, తాగు నీరు, మరుగుదొడ్లు, ప్రహరీ గోడ, డ్రైనేజీ తదితర మౌలిక వసతుల సమస్యలు తీవ్రంగా ఉన్నాయని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నరెడ్డి తులసిరెడ్డి తెలిపారు. శనివారం కాంగ్రెస్ నాయకులతో కలిసి పాఠశాలను సందర్శించిన ఆయన హెడ్మాస్టర్, ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. రూ.12 కోట్లతో నూతన భవనాలు నిర్మించినప్పటికీ మౌలిక సదుపాయాల కొరత కొనసాగుతోందని అన్నారు. మూడు ఆర్వో ప్లాంట్లు పనిచేయడం లేదని, డైనింగ్ హాల్ లేక విద్యార్థులు నేలపై భోజనం చేస్తున్నారని, మరుగుదొడ్లు, విద్యుత్ పరికరాలు పనిచేయడం లేదని తెలిపారు. అసంపూర్తిగా ఉన్న ప్రహరీ గోడ, నిలిచిపోయిన తరగతి గదుల నిర్మాణం, వర్షపు నీటి నిల్వ తో పాటు సమస్యలు అనేకం ఉన్నాయని తెలిపారు. పాఠశాల సమస్యలను పరిష్కరించి విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని జిల్లా విద్యాశాఖ అధికారులు, కలెక్టర్, రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని తులసిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

## మానవత్వమే మహోన్నత మతం..



**జమ్మలమడుగు, జులై 18, ప్రభాతవార్త:**
స్థానిక జమ్మలమడుగు ఆర్టీపీపీ నందు లక్షుమ్మ అనారోగ్యం చేత మరణించగా అంతిమ సంస్కరణలు చేయడానికి బంధువులు ఎవరు ముందుకు రాకపోవడంతో స్థానికులు ఫోన్ ద్వారా మే ఐ హెల్ప్‌యూ ఫౌండేషన్ టౌన్ వైస్ ప్రెసిడెంట్ మునీంద్రాను సంప్రదించగా స్పందించి శనివారం హిందూ స్మశాన వాటికలో హిందూ సంప్రదాయం ప్రకారంగా అంతిమ సంస్కరణలు నిర్వహించారు. ఇటువంటి గొప్ప కార్యక్రమానికి చేయూత అందించిన ఫౌండేషన్ ఛైర్మన్ మోరే లక్ష్మణ్‌రావు, టౌన్ ప్రెసిడెంట్ సుబహాన్, వైస్ ప్రెసిడెంట్ మునీంద్రా, ఈశ్వర్ వర్ధన్‌రెడ్డి, అశోక్‌కుమార్ పాల్గొని అంత్యక్రియలను పూర్తి చేశారు. ఛైర్మన్ మోరే లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ సమాజంలో ఎవరూ లేని వారికి కూడా గౌరవప్రదమైన అంతిమ సంస్కారాలు జరగాలనే ఉద్దేశంతో ఈ సేవా కార్యక్రమం చేపట్టామని వారు తెలిపారు. మే ఐ హెల్ప్‌యూ ఫౌండేషన్ నిరంతరం ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపడుతూ అవసరంలో ఉన్న వారికి అండగా నిలుస్తుందని సభ్యులు పేర్కొన్నారు. మా శ్రీ అమ్మ శరణాలయం లోని వృద్ధులకు సహాయం చేయదలచని ఎవరైనా దాతలు ఉంటే 8297253483, 9182244150 నంబర్లను సంప్రదించాలన్నారు.

## వృత్యంతర శిక్షణ కార్యక్రమం



**జమ్మలమడుగు, జులై 18, ప్రభాతవార్త:**
ప్రొద్దుటూరు డివిజన్‌లోని నాన్ లాంగ్వేజెస్ ఉపాధ్యాయులకు అనగా మ్యాథ్స్, ఫిజికల్ సైన్స్, బయాలజికల్ సైన్స్ మరియు సోషల్ స్టడీస్ ఉపాధ్యాయులకు ఒక రోజు వృత్యంతర శిక్షణలో భాగంగా శనివారం స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలు మరియు వైఎస్ మున్సిపల్ కల్చర్ స్కూలు నందు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమానికి కోర్సు అబ్జర్వర్‌గా ఉప విద్యాశాఖాధికారి జి.ఎల్.వి.ఎస్. శివప్రసాద్ వ్యవహరించారు. ఉపాధ్యాయులను ఉద్దేశించి ఒక విద్యాశాఖాధికారి మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులకు తర్ఫీదు ఇవ్వాలని మరియు విద్యార్థులు అభ్యసన సామర్థ్యాలు సాధించడంలో భాగంగా ఉపాధ్యాయులు మరింతగా కృషి చేయాలని కోరారు. దాదాపుగా డివిజన్ పరిధిలో 600 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గణిత స్టేట్ రిసోర్స్ పర్సన్లు అట్లా నరసింహారెడ్డి, తులసి లక్ష్మి, సుబ్బానాయుడు, విజయ మోహన్‌రెడ్డి, బాబాసాహెబ్, తిరుమల కొండు భాస్కర్, నరసింహులు, డీఆర్పీలు పాల్గొన్నారు. కోర్సు కోఆర్డినేటర్లుగా ప్రధానోపాధ్యాయులు గౌస్ మొహిద్దీన్, గురప్పలు వ్యవహరించారు.

## తండ్రి మరణంపై అనుమానం.. ఫిర్యాదు

**జమ్మలమడుగు, జులై 18, ప్రభాతవార్త:**
జమ్మలమడుగు నియోజకవర్గం పెద్దముడియం మండలం మేడిదిన్నె ఎస్సీ కాలనీలో ఈ నెల 13న తండ్రి కొమ్మ ఓబులేసు అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన మృతిపై అనుమానాలున్నాయని అందుకు నంద్యాల జిల్లా సంజామల మండలం నొస్సంకు చెందిన ఓ ఆర్ఎంపీ ఇచ్చిన ఇంజెక్షన్ వికటించడమే కారణమని ఆయన కొడుకు చిన్న ఓబులేసు శనివారం జమ్మలమడుగు ఇన్‌ఛార్జి ఆర్డీవో శిరీషకు ఎంఎస్‌పీ నియోజకవర్గం ఇన్‌ఛార్జి చిన్నయ్య సమక్షంలో ఫిర్యాదు చేశారు. తన తండ్రి చనిపోయినప్పుడు ఛర్మం మొత్తం ఊడపోయి శరీరం ఎర్రగా మారి తీవ్ర అస్వస్తతతో మృతి చెందాడని మృతుని కొడుకు వాపోయాడు. సంబంధిత అధికారులు తగు విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు.

## నీళ్ల ట్యాంక్ పరిశుభ్రం



**దువ్వూరు, జులై 18, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన దువ్వూరులోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న రక్షిత మం చినీటి పథకానికి సంబంధించిన నీళ్ల ట్యాంక్ ను శనివారం పంచాయతీ సిబ్బంది పరిశుభ్రం చేశా రు. గత కొన్ని రోజులుగా నీళ్ల ట్యాంక్ క్రింది భా గాన స్వల్ప లీకేజీ రావడం అలాగే కిందికి వెళ్లే నీటిలో చెత్తాచెదారం ఉండడంతో వాటిని తొలగించేందుకు నీటిని నిలిపివేసి మరమ్మత చర్యలు చేపట్టారు. అందులో భాగంగా శనివారం పంచాయతీ సిబ్బంది నీళ్ల ట్యాంకులు శుభ్రం చేసి క్లోరినేషన్ చేయించారు. వర్షాకాలం వస్తున్నందున నీరు కలుషితం కాకుండా ఉండేందుకు ఈ చర్యలు చేపట్టినట్లు ఏఈ శివకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి భాగ్యలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

## లింగ నిర్ధారణ చట్టం ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



**బద్వేలు అర్బన్, జూలై 18, ప్రభాతవార్త**
స్కాన్ సెంటర్లలో లింగ నిర్ధారణ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని బద్వేల్ డివిజనల్ రెవెన్యూ అధికారి హెచ్.చంద్రమోహన్ హెచ్చరించారు. శుక్రవారం బద్వేల్ రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సబ్ డివిజనల్ పోలీస్ అధికారి జి.రాజేంద్ర ప్రసాద్ ఆదేశాల మేరకు సబ్ డిస్ట్రిక్ట్ మల్టీ మెంబర్స్ అథారిటీ కమిటీ సమావేశం జరిగింది. ఉప జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా.బి.మల్లేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో చంద్రమోహన్ మాట్లాడుతూ ప్రైవేట్, ప్రభుత్వ ఆసుపత్రులు, స్కాన్ సెంటర్లలో పిండం లింగ నిర్ధారణ చేయడం చట్టం ప్రకారం నేరమని తెలిపారు. స్కానింగ్ సమయంలో ఆడ, మగ అని చెప్పినా, ఆ సమాచారం ఇచ్చినా సంబంధిత వైద్యులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఉప జిల్లా వైద్యాధికారి డా.బి.మల్లేష్ మాట్లాడుతూ లింగ నిర్ధారణ చేసి తెలియజేసే స్కానింగ్ సెంటర్లు, ఆసుపత్రులను సీజ్ చేసి లైసెన్సులు రద్దు చేస్తామని అన్నారు. చట్ట ఉల్లంఘనలపై ప్రజలు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో డా.బి.రాజేష్ కుమార్, డా.వై.శ్రీనివాసులు, డా.పి.శరత్ చంద్ర, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బి.వెంగయ్య, హెల్త్ సూపర్వైజర్లు శివరాం రెడ్డి, వి.జనార్దన్ రావు, శ్రీరామయ్య, ఆశా కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రవాణా.. ప్రజల ఫిర్యాదులపై అధికారులు మోనం



**వీరబల్లి జులై 18 ప్రభాతవార్త:**
అధికారులు ఆగస్టు వరకు ఇసుక అక్రమ రవాణా చేయరాదని ట్రాక్టర్ యజమానులకు తెలియజేశారు. అధికారులు ఎంత చెప్పినా కూడా ఇసుక అక్రమ రవాణా రాత్రివేళలో రాయచోటి రామాపురం చిన్నమండెం ఏరియాలకు తరలి వెళుతుంది అధికారులు కూడా చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు గ్రామస్తులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసిన కూడా పట్టించుకోవడంలేదని ప్రజలు వాపోతున్నారు ముఖ్యంగాపెదివీడు పరిసర ప్రాంతాల్లో అక్రమ ఇసుక తవ్వకం, రవాణా రోజురోజుకు పెరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు స్పందించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నదులు, వాగుల నుంచి అనుమతులు లేకుండానే ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.స్థానికుల కథనం ప్రకారం, పలుమార్లు రెవెన్యూ, గనుల శాఖ, పోలీసు అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోలేదని వారు చెబుతున్నారు. దీంతో అక్రమ ఇసుక రవాణాదారులు నిర్భయంగా తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్నారని ఆరోపిస్తున్నారు. అక్రమ ఇసుక తవ్వకాల కారణంగా వాగులు, నది తీరాలు దెబ్బతింటున్నాయని, భూగర్భ జలాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే గ్రామీణ రహదారులపై భారీ వాహనాల రాకపోకల వల్ల రోడ్లు దెబ్బతింటున్నాయని, ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు.ప్రజలు జిల్లా యంత్రాంగం వెంటనే జోక్యం చేసుకుని అక్రమ ఇసుక తవ్వకం, రవాణాపై ప్రత్యేక దాడులు నిర్వహించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అక్రమ రవాణాను అరికట్టేందుకు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ప్రజలు తెలిపారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**దువ్వూరు, జులై 18, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని వివిధ సబ్ స్టేషన్ లలో ఆదివారం ఉదయం 8 నుండి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ రాజకుమార్ తెలిపారు. చింతకుంట, దువ్వూరు, చిన్నసింగన పల్లె, జిల్లెల్ల, కానగూడూరు తదితర సబ్ స్టేషన్ ల పరిధిలో ఉదయం విద్యుత్ సరఫరా ఉండదన్నారు. 33కెవి, 11కెవి వైర్లలో మరమ్మత్తులు ఉన్నాయని అలాగే సబ్ స్టేషన్లలో మరమ్మతులు చేయవలసి ఉండగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని గమనించాలని కోరారు.

## ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

**పులివెందుల జూలై 18 ప్రభాత వార్త :**
పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కృషి చేస్తానని నూతన ట్రాఫిక్ ఎస్సై టి. గంగాధర్ రెడ్డి తెలిపారు. కడప వీఆర్ నుంచి బదిలీపై వచ్చిన ఆయన శనివారం పులివెం దుల ట్రాఫిక్ ఎస్సైగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక చర్యలు చేపడతా మన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని కోరారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు.

## దువ్వూరులో ఓ మోస్తారు వర్షం

**దువ్వూరు, జులై 18, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన దువ్వూరులో శుక్రవారం రాత్రి ఒక మోస్తారు వర్షం కురిసింది. మండల వ్యాప్తంగా 16.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయినట్లు అధికారులు తెలిపారు. గత 20 రోజులుగా వర్షాలు లేకపోవడంతో ప్రజలు ఎండ వేడిమిని తట్టుకోలేక పోయారు. అలాగే మినుము, పసుపు, మొక్కజొన్న తదితర పంటలు సాగు చేసిన రైతులు కూడా నీటి కొరకు ఇబ్బందులు పడేవారు. శుక్రవారం రాత్రి ఒక మోస్తారు వర్షం కురవడంతో ప్రజలకు, రైతులకు ఉపశమనం కలిగిందని చెప్పవచ్చు. శనివారం కూడా మేఘాలు ఉండటంతో వర్షం వస్తుందనే ఆశతో రైతులు ఉన్నారు.

## ప్రతిభావంతులైన విద్యార్థులకు షైనింగ్ స్టార్ అవార్డులు..

**సుండుపల్లె, జూలై 18,ప్రభాతవార్త :**
ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రతిభావంతులైన విద్యార్థులకు షైనింగ్ స్టార్ అవార్డ్స్-2026ను ఈ నెల 20న కడప మాధవి కన్వెన్షన్‌లో ప్రదానం చేయనున్నారు. ఎంపికైన విద్యార్థులకు రూ.20 వేల నగదు బహుమతి, మెడల్, ప్రశంసాపత్రం అందజేస్తారు. ప్రతి మండలం నుంచి ఆరుగురు ప్రతిభావంతులైన విద్యార్థులతో పాటు దివ్యాంగ విద్యార్థులకు ప్రత్యేక అవకాశం కల్పించారు. సుండుపల్లె నుంచి ఏడుగురు విద్యార్థులు ఎంపికకు అర్హులైనట్లు విద్యాశాఖ అధికారి వెంకటేష్ నాయక్ తెలిపారు. విద్యార్థుల్లో ప్రతిభను ప్రోత్సహించి విద్యా ప్రమాణాలను పెంపొందించడమే ఈ అవార్డుల లక్ష్యమన్నారు.



## ఒంటిమిట్ట సీఐ వెంకటేశ్వర్లుకు ఘన సన్మానం

**నందలూరు, జులై 18 ప్రభాతవార్త:**
ఒంటిమిట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి. వెంకటేశ్వర్లుకు ప్రజాసేవలో విశిష్ట సేవలను గుర్తిస్తూ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సేవారత్న జాతీయ అవార్డు ప్రదానం చేశారు. సంస్థ జాతీయ అధ్యక్షులు తాళ్లూరి ప్రసన్నకుమార్ ఆదేశాల మేరకు కడప జిల్లా చైర్మన్ డాక్టర్ వి. డేవిడ్ సేవారత్న అవార్డు, ప్రశంసాపత్రం, మెమెంటోను అందజేశారు.

# ప్రజల సహకారంతోనే స్వచ్ఛ రాజంపేట సాధ్యం

రాజంపేట, జూలై 18 ప్రభాతవార్త

ఏ కార్యక్రమం అయినా విజయవంతం కావాలంటే ప్రజల సహకారం అవసరమని, ప్రజల భాగస్వామ్యం లేనిదే ఎక్కడ ఫలితాలు రావని రాజంపేట టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు అన్నారు. పరిశుభ్రత ప్రజలందరి బాధ్యతఅని తెలుసుకోవాలన్నారు. ప్రజలు పాలకులకు సహకరించాలన్నారు. శనివారం రాజంపేట స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన " స్వర్ణాంధ్ర స్వచ్ఛంధ్ర" కార్యక్రమంలో జగన్ మోహన్ రాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ కు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.ప్రజలు రోడ్లమీద చెత్తను విచ్చలవిడిగా పడవేయకుండా, ఇంట్లోనే తడి పొడి చెత్తలుగా విభజించి మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని కోరారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ప్రవర్తిస్తే చెత్త నుంచి సంపద సృష్టించవచ్చునన్నారు. విజనరీ నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు చెత్త నుండి కూడా సంపద సృష్టించవచ్చునని నిరూపించారని, ఆరోగ్యాంధ్రప్రదేశ్ కోసం పురవీధుల్లో " స్వచ్ఛ రథం స్వర్ణ రథం " వాహనాలు తిరుగుతూ ప్రజల నుండి చెత్త స్వీకరించి నిత్యవసర సరుకులు అందజేస్తున్నారని చమర్తి తెలిపారు. ప్రజలు ఈ స్వర్ణ రథాన్ని కూడా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పరిశుభ్రత పట్ల ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా బాధ్యత వహిస్తే ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యం సునాయాసంగా సాధ్యమవుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మార్కెట్ చైర్మన్ గన్నే సుబ్బ నరసయ్య నాయుడు, వైస్ చైర్మన్ చంగల్ రాయుడు,పట్టణ అధ్యక్షులు దగుబాటి సుబ్రహ్మణ్యం నాయుడు, మాజీ రాష్ట్ర కార్యదర్శి ఇడిమడకల కుమార్,పార్లమెంట్ కార్యాలయ కార్యదర్శి ఎస్కె కరీమ్,మాజీ రాష్ట్ర డైరెక్టర్ గుల్జార్ భాష, మాజీ పట్టణ అధ్యక్షులు సంజీవరావు, క్లస్టర్ ఇంచార్జ్ కొల్లి రెడ్డి నాయుడు, డాక్టర్ నవీన్ కుమార్, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న జగన్మోహన్ రాజు



ర్యాలీలో పాల్గొన్న మహిళలు

## అభయ ఆంజనేయ స్వామి విగ్రహ ఆవిష్కరణ

సిద్ధవటం, జూలై 18 ప్రభాతవార్త



మండలంలోని కడప చెన్నై జాతీయ రహదారి కనుమనోపల్లి పల్లి సమీపాన వెలిసిన నీలకంఠేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం 20 అడుగుల ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట వైభోవహితంగా జరిగింది స్వామివారికి పంచామృత అభిషేకాలు ఆకుపూజ గణపతి పూజ వంటి విశిష్ట పూజలు నిర్వహించారు. వచ్చిన భక్తులకు అన్నప్రసాదాలు సమకూర్చారు ఈ సందర్భంగా ఆలయ ట్రస్ట్ అధినేత సోమా బాబు శనివారం మాట్లాడుతూ కడప నగరానికి చెందిన బాపనపల్లి మధుసూదన్ (ఎన్నారై) 5 లక్షల రూ వ్యవధితో 20 అడుగుల ఆంజనేయ స్వామి విగ్రహం సమకూర్చి భక్తులకు అందుబాటులోకి తీసుకొచ్చారని పేర్కొన్నారు మధుసూదన్ (ఎన్నారై) మాట్లాడుతూ మా తండ్రి కీర్తిశేషులు శివయ్య జ్ఞాపకార్థం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అందుబాటులోకి 20 అడుగుల ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేశామని రాబోయే రోజుల్లో ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి చైతన్య శర్మ భావనపల్లి జ్యోతి, జశ్విత, తదితర భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## తిరుమలకు కాలినడకన పాదయాత్ర



బద్వేల్, జూలై 18, ప్రభాతవార్త

బద్వేల్ మండలం పుట్టాయిపల్లి గ్రామ పంచాయతీకి చెందిన సుమారు 40 మంది భక్తులు శనివారం తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి దర్శనార్థం కాలినడకన పాదయాత్రను ప్రారంభించారు. ఈ పాదయాత్రకు బద్వేల్ మండల జెడ్పీటీసీ చిన్నపోలిరెడ్డి, పుట్టాయిపల్లి వాటర్‌షెడ్ చైర్మన్ బీరం పెంచలరెడ్డి ఆధ్వర్యం వహించారు. పాదయాత్ర బృందం రాజంపేటకు చేరుకోగా వైఎస్సార్సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వంకెల పెద్ద పోలిరెడ్డి భక్తులను కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వంకెల పెద్ద పోలిరెడ్డి మాట్లాడుతూ, తిరుమల పాదయాత్రకు బయలుదేరిన భక్తుల భక్తి, సంకల్పం అభినందనీయమన్నారు. స్వామివారి అనుగ్రహంతో పాదయాత్ర ఎలాంటి ఆటంకాలు లేకుండా విజయవంతంగా పూర్తై, భక్తులంతా క్షేమంగా తిరిగి రావాలని ఆకాంక్షించారు. భక్తులు గోవింద నామస్మరణ చేస్తూ ఉత్సాహంగా తిరుమల వైపు పాదయాత్రను కొనసాగించారు. ఈ కార్యక్రమంలో బైసాని వీరారెడ్డి, చెన్నుపల్లి వెంకటసుబ్బారెడ్డి, ముడమాల శివరామిరెడ్డి, గ్రామ పెద్దలు, యువకులు, వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డు పరిశీలన

జమ్మలమడుగు, జులై 18, ప్రభాతవార్త:



జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని దిగువపట్నం కాలనీ డంపింగ్ యార్డును స్వచ్ఛ ంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్, భూపేష్‌రెడ్డితో కలిసి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యర్థాల నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టడంతో పాటు ప్రజారోగ్య భద్రతకు ఎలాంటి విఘాతం కలగకుండా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు నగర పరిశుభ్రతను మరింత మెరుగుపరచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జంభాపురం రమణారెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, స్వచ్ఛ ఆంధ్ర డైరెక్టర్ పర్వీన్ భాను, పొన్నతోట శ్రీనివాసులు, అబవరం రామయ్య, బిర్రు గురప్ప, మున్సిపల్ సిబ్బంది కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా

## మార్కెట్‌లో పారిశుధ్య కార్యక్రమం



ముద్దనూరు, జూలై 18 ప్రభాతవార్త:

స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ముద్దనూరు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక మార్కెట్ ప్రాంగణంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) రాధాకృష్ణవేణి ఆధ్వర్యంలో వహించారు. మార్కెట్ పరిసరాలను శుభ్రం చేయించడంతో పాటు, అక్కడి దుకాణదారులకు పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణ, వ్యర్థాల సరైన నిర్వహణపై అవగాహన కల్పించారు. అనంతరం దుకాణదారులందరితో కలిసి స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు సిబ్బంది, దుకాణదారులు తదితరులు పాల్గొన్నారు.

# సిడిపిఓ సునిత ఆధ్వర్యంలో బాలికే భవిష్యత్

భ్రుణ హత్యల నివారణకు కృషి చేయాలి

వేంపల్లె జూలై 18 ప్రభాతవార్త

చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ (సిడిపిఓ) వి.సునిత ఆధ్వర్యంలో బాలికే భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో బేటి బాచావో, బేటి పడావో..బాలికే భవిష్యత్ పై విద్యార్థినిలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిడిపిఓ సునిత మాట్లాడుతూ భ్రుణ హత్యల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. తల్లిగర్భంలో ఉండగానే ఆడపిల్ల అని తెలుసుకొని అబార్షన్ చేసే పరిస్థితులు ఉన్నాయన్నారు. దీనివల్ల స్త్రీ, పురుష నిష్పత్తి సమతుల్యత దెబ్బతిని బాలికల పట్ల వివక్షత, అఘాయిత్యాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. బాలికలకు చదువు ఒక ఆయుధం వంటిదని, ప్రతి విద్యార్థిని బాగా చదివి ప్రగతి పథంలో ముందుకెళ్లి, స్వయం ప్రతిపత్తితో నిలదొక్కుకోవాలన్నారు. బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు, అక్రమ రవాణా, స్కూల్ డ్రాప్ఔట్ వంటి సమస్యల నివారణకు హెల్ప్ లైన్ 1098కి సమాచారం అందించాలని కోరారు.



ఈ కార్యక్రమంలో ఎంఇఓ స్టాలిన్ ఐజాక్, ఇంచార్జీ హెచ్ఎం చెరుకూరి శ్రీనివాసులు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు స్వర్ణలత, సుభద్ర, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సాఫ్ట్ బాల్

## క్రీడా సామాగ్రి బహుకరణ



క్రీడా సామాగ్రితో విద్యార్థులు ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

సుండుపల్లె, జులై 18,ప్రభాతవార్త :

మండల కేంద్రమైన సుండుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కొంత క్రీడా సామాగ్రిని ఎంకెఆర్ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ యర్రపురెడ్డి జయమ్మ వితరణ చేశారు. పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్ ప్రతి రోజు విద్యార్థులకు సాఫ్ట్ బాల్ లో ఇస్తున్న శిక్షణను గమనించిన కళాశాల ప్రిన్సిపాల్ శైలజ క్రీడా సామాగ్రి కొరతను గుర్తించి కరస్పాండెంట్ జయమ్మ దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన కరస్పాండెంట్ తమ కళాశాల వంతుగా ఎనిమిది వేల ఐదు వందల రూపాయలు విలువ చేసే సాఫ్ట్ బాల్ ఒక క్యాచర్ కిట్ ను విజయవాడ నుంచి తెప్పించారు.సాఫ్ట్ బాల్ ఆడే సమయంలో విద్యార్థులకు బాల్ ద్వారా ఎలాంటి దెబ్బలు తగలకుండా ఉండేందుకు క్యాచర్ కిట్ లోని లెగ్ ప్యాడ్స్, చెస్ట్ ప్యాడ్,ఫేస్ మాస్క్(హెల్మెట్ )లను కళాశాల యాజమాన్యం తరపున ప్రిన్సిపాల్ శైలజ ఫిజికల్ డైరెక్టర్ రాధారాణి, విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యానికి, ప్రిన్సిపాల్ కు పాఠశాల తరపున ప్రధానోపాధ్యాయు లు షాకీరా బేగం,పీడి రాధారాణి లు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా...

## భేటీ బచావో-భేటీ పడావోతో అవగాహన



మైదుకూరు, జూలై 18, ప్రభాతవార్త:

విద్యార్థుల భవిష్యత్తు సురక్షితంగా, బాలికల విద్యాభివృద్ధి లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన "భేటీ బచావో - భేటీ పడావో" కార్యక్రమంలో భాగంగా శనివారం మైదుకూరు మండలంలోని జెడ్పీహెచ్ఎస్ వనిపెంట పాఠశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్వైజర్ జె. ప్రశాంతి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రతి బాలిక విద్యను కొనసాగించడం, బాలల హక్కులను పరిరక్షించడం సమాజం బాధ్యత అని పేర్కొన్నారు. మిషన్ వాత్సల్య పథకం, చైల్డ్ హెల్ప్‌లైన్-1098, ఉమెన్ హెల్ప్‌లైన్-181, మిషన్ శక్తి, బాల్య వివాహాల నివారణ, బాలల భద్రత వంటి కీలక అంశాలపై విద్యార్థులకు సమగ్ర అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో హెల్ప్‌లైన్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు.అదే విధంగా స్థానిక కేజీబీవీ పాఠశాలలో కూడా ఐసీడీఎస్ సూపర్వైజర్ జె. శ్రీదేవి ఆధ్వర్యంలో భేటీ బచావో-భేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికల విద్య, భద్రత, చట్టపరమైన రక్షణ, మిషన్ వాత్సల్య, చైల్డ్ హెల్ప్‌లైన్-1098, ఉమెన్ హెల్ప్‌లైన్-181, మిషన్ శక్తి పథకాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమాల్లో జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు, కేజీబీవీ ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, ఐసీడీఎస్ సిబ్బంది, విద్యార్థులు, విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ అవగాహన కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు, బాలల హక్కులు, భద్రత, విద్య ప్రాముఖ్యతపై స్పష్టమైన అవగాహన కల్పించి వారి భవిష్యత్తును మరింత సురక్షితంగా తీర్చిదిద్దేందుకు దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వాచ్మెన్ కొరత

ఖాజీపేట జూలై 18, ప్రభాతవార్త

మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గత కొన్ని నెలలుగా వాచ్మెన్ లేక ఇబ్బందికరంగా ఉందని హాస్పిటల్స్ సిబ్బంది తెలిపారు, హాస్పిటల్ ఊరి బయట ఉండడంతో రాత్రి సమయంలో డ్యూటీ చేసే నర్సులకు ఇబ్బందికరంగా ఉందని ఊరి బయట ఉండడంతో ఎవరైనా ఆకతాయిలు మందు బాబులు తిరుగుతున్న సమయంలో వాచ్మెన్ ఉంటే మాకు ధైర్యంగా ఉంటుందని హాస్పిటల్ సిబ్బంది తెలిపారు, ఉన్నతాధికారులు స్పందించి హాస్పిటల్లో వాచ్మెన్ నియమించి హాస్పిటల్లో నైట్ డ్యూటీ చేసే నర్సులకి భద్రత కల్పించాలని హాస్పిటల్స్ సిబ్బంది కోరారు,

గ్రామపంచాయతీలో పారిశుద్ధం

## త్రాగునీటి సమస్య ఉండరాదు



రాజుపాలెం, జులై 18, ప్రభాతవార్త.

గ్రామపంచాయతీలలో త్రాగునీటి, పారిశుద్ధ్యము సమస్యలు లేకుండా చూడాలని జిల్లా పరిషత్ సీఈవో సుబ్రమణ్యం తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సురేష్ బాబు అధ్యక్షతన శనివారం జరిగిన గ్రామ పంచాయతీ కార్యదర్శుల సమీక్షా సమావేశంలో ఏ గ్రామ పంచాయతీలో అయినా పారిశుద్ధ్య సమస్య కానీ, తాగునీటి సమస్య కానీ ఉండరాదని, ఓవర్ హెడ్ ట్యాంకులలో క్లోరినైజేషన్ తప్పనిసరి అని, గ్రీన్ అంబాసిడర్ ల ద్వారా పారిశుద్ధం, చెత్త సేకరణ, చెత్త నుండి సంపద కేంద్రాలకు తరలించి గ్రామాల్లోని వీధులన్నీ పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. గ్రామపంచాయతీలో దోమల నిర్మూలనకు చర్యలు చేపట్టాలని, మురుగునీటి నిల్వలను లేకుండా చూడాలని తెలుపుతూ ప్రభుత్వం చేపట్టే ప్రతి కార్యక్రమంఅన్నిశాఖ ల ప్రభుత్వ ఉద్యోగులు బాధ్యతగా చేయవలసి ఉంటుందని ఈ పని మాది కాదని మాకు సంబంధం లేదనే ధోరణిలో ఉండరాదని ప్రతి ఒక్క ఉద్యోగి పద్ధతి మార్చుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో షాకీర్ అలీ ఖాన్ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## బోధన నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న ఎంఈఓ బాబు నాయక్

పీలేరు జూలై 18 ప్రభాతవార్త;

స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో బోధన నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత కోటపల్లి బాలుర ఉన్నత హైస్కూల్, బాలికల ఉన్నత పాఠశాలలో పీలేరు నియోజకవర్గం 370 మంది ఉపాధ్యాయులకు గణితం, సాంఘిక శాస్త్రం, భౌతిక శాస్త్రం జీవ శాస్త్రం పై ఉపాధ్యాయులకు ఒక్కరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు.

## జీవో 396 రద్దు చేయాలి

పులివెందుల, జూలై 18 , ప్రభాతవార్త :

రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్ 396ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా దస్తావేజులేఖరులు (రైటర్స్) ఈ నెల 20వ తేదీ నుంచి 31వ తేదీ వరకు పెన్‌డౌన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పులివెందుల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి చెందిన దస్తావేజులేఖరులు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవో నంబర్ 396 కారణంగా రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది దస్తావేజులేఖరుల జీవనోపాధి ప్రమాదంలో పడే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. రిజిస్ట్రేషన్ శాఖను ప్రైవేటీకరించే చర్యల వల్ల దస్తావేజులేఖరుల ఉపాధి దెబ్బతినడమే కాకుండా, ప్రజల ఆస్తులు, భూముల భద్రతపై కూడా అనుమా నాలు తలెత్తే అవకాశం ఉందని పేర్కొన్నారు. దస్తావేజులేఖరుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, జీవో నంబర్ 396ను రద్దు చేసి తమ ఉపాధిని కాపాడాలని వారు కోరారు. డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు పెన్‌డౌన్ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఈ నేపథ్యంలో ప్రజలు తమ భూములు, ఆస్తులకు సంబంధించిన రిజిస్ట్రేషన్ వ్యవహారాల్లో అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన అన్ని పత్రాలను పూర్తిగా పరిశీలించుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. దస్తావేజులేఖరుల ఉద్యమానికి ప్రజలు సహకరించి మద్దతు ఇవ్వాలని వారు కోరారు.



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

# ముఖ్యమంత్రిచే కమిషనర్‌కు ఉత్తమ అవార్డు ప్రధానం

కమిషనర్‌ను అభినందించిన జిల్లా కలెక్టర్

మదనపల్లె, జులై 18 ప్రభాతవార్త :

ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా శనివారం ఆఫరేషన్ క్లీన్‌స్వీప్ ఉత్తమ సేవా పథకాన్ని మున్సిపల్ కమీషనర్ ప్రమీల అందుకొన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆపరేషన్ క్లీన్ స్వీప్ పథకంలో (స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర) విజయవంతంగా నిర్వహించిన నేపథ్యంలో విజయవాడలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా కమిషనర్ అవార్డు అందుకొన్నారు. 2026 మే 23 నుంచి నెల రోజులు పాటు నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా 123 మున్సిపాలిటిల్లో 9మున్సిపాలిటీలు అవార్డుకు ఎంపిక అయ్యాయి. 50వేల నుంచి 3లక్షల జనాభా లోపు ఉన్న మున్సిపాలిటిల్లో మదనపల్లె మున్సిపాలిటి ఆపరేషన్ క్లీన్‌స్వీప్ పథకంలో విజయవంతంగా చేసినందుకు గానూ ముఖ్యమంత్రి ఉత్తమ సేవా పథకాన్ని అందజేశారు. ఈసందర్భంగా కమిషనర్ ప్రమీల మాట్లాడుతూ ముఖ్యమంత్రి చేతుల మీదుగా తాను ఉత్తమ సేవా పథకాన్ని అందుకోవడం మరింత బాధ్యత పెంచిందన్నారు. ప్రత్యేకంగా జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ఉత్తమ మూడు మున్సిపాలిటిల్లో మదనపల్లె మున్సిపాలిటికి స్థానం దక్కడం జిల్లాకు గర్వకారణమన్నారు. కమిషనర్ ముఖ్యమంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకోవడం అభినందనీయన్నారు.



అవార్డు అందుకొంటున్న కమిషనర్

# జల్జీవన్ పథకం ద్వారా ఇంటింటికి కులాయి కలెక్షన్ : మంత్రి





లక్కిరెడ్డిపల్లి జూలై 18 ప్రభాతవార్త

జల్ జీవన్ పథకం ద్వారా ఇంటింటికీ కొళాయి కనెక్షన్ ఏర్పాటు చేసి త్రాగునీటి సమస్య తీరుస్తామని మంత్రి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం కోనంపేట జాండ్రపల్లి గ్రామాలలో ఆయన పర్యటించి ప్రజా సమస్యలపై ఆరాధించారు. ప్రతి సమస్య పరిష్కరిస్తామని ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలు పరిష్కరిస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో మున్సిపల్ పంచాయతీ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఘనవిజయం సాధించాలని ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేసి కూటమి ప్రభుత్వానికి అండగా నిలవాలన్నారు అంతే కాకుండా సర్ కార్యక్రమం ఓటర్ జాబితా నిరక్ష్యం లేకుండా అన్ని సరిచూసుకోవాలన్నారు. వార్డు నుంచి గ్రామపంచాయతీ వరకు ప్రతి కార్యకర్త సైనికుడిలా కష్టపడి పని చేస్తే పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. 175 నియోజకవర్గాలలో జల్జీవన్ మొట్టమొదటిసారిగా రాయచోటి నియోజకవర్గానికి మంజూరు చేయడం శుభపరిణామన్నారు. ఇప్పటికే మారుమూల ప్రాంతం సైతం కోట్ల రూపాయలు హెచ్చించి తారు రోడ్లు సిమెంట్ రోడ్లు త్రాగునీటి సమస్య అన్ని పరిష్కరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి సోదరుడు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి హరిప్రసాద్ మండల టిడిపి అధ్యక్షుడు యనమల మదనమోహన్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్ ఎన్ డి షపినాయక్ క్లస్టర్ ఇంచార్జి శంకరప్ప జయరాం డిసిసిబి చైర్మన్ దేవేందర్ రెడ్డి మాజీ ఎంపీపీ ఉమాపతి రెడ్డి దినపాడు చెరువు ప్రెసిడెంట్ మోహన్ రెడ్డి లక్కిరెడ్డిపల్లె సింగల్ బెండు అధ్యక్షుడు లక్ష్మీరాజు మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ యాగంటి సుధీర్ కుమార్ టిడిపి కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు. వైసీపీ జడ్పిటిసి అంబా బత్తిన రమాదేవి,మాజీ ఎంపీపీ అంబా బత్తెన రెడ్డయ్య. లక్కిరెడ్డిపల్లి జడ్పిటిసి (వైసిపి) మాజీ ఎంపీపీ అంబా బత్తిన రెడ్డయ్య దపైపల్లె గ్రామానికి చెందిన మరి కొంతమంది వైసీపీ నాయకులు 100 కుటుంబాలు వైసీపీని ఈ డి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సమక్షంలో శనివారం టిడిపి కండువా కప్పుకున్నారు ఈ సందర్భంగా జెడ్పిటిసి రమాదేవి మాట్లాడుతూ వైసీపీలో సరైన గౌరవం లేదని దీనికి తోడు టిడిపి ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తున్నాడని అభివృద్ధి కార్యక్రమాలు చూసి వైసిపి ని ఈడి టిడిపిలోకి చేరామని రమాదేవి అంబాసిడర్ పేర్కొన్నారు.

## విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

కలసపాడు, జూలై 18 ప్రభాతవార్త:

గ్రామీణ ప్రాంతాలలోని ప్రభుత్వ పాఠశాలల యందు చదువు విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని ఏసిఆర్ కన్స్ట్రక్షన్స్ అండ్ ఇన్ఫ్రా అధినేత అంబవరం చెన్నారెడ్డి తెలిపారు. తనవంతుగా తాను చదివిన పాఠశాలకు పూర్వ విద్యార్థిగా తన వంతు ఏదో ఒకటి చేయాలనే సదుద్దేశంతో పాఠశాలలో చదువు పేద విద్యార్థులను ఉన్నత విద్య వైపు ప్రోత్సహించాలనే తలంపుతో నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నట్లు చెన్నారెడ్డి తెలిపారు. విద్యార్థులు ఈ నగదు ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. 2026 సంవత్సరం మార్చి నెలలో జరిగిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో అత్యుత్తమ మార్కులతో మొదటి ఐదు స్థానాలలో నిలిచిన విద్యార్థులు బి.ప్రణతి,ఎస్.అప్పన,డి.సతీష్ కుమార్,బి.బేబీ,ఎస్.మిస్బా లకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేసే కార్యక్రమం శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి.పోలిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయు జిల్లా ఆర్థిక కార్యదర్శి యు.సుబ్రమణ్యం,పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.నారాయణరెడ్డి, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు,దాత సోదరుడైన ఉపాధ్యాయుడు అంబవరం నారాయణరెడ్డి,స్టాఫ్ సెక్రటరీ బి.వెంకటసుబ్బారెడ్డి,ఎస్టీయు రీజనల్ కన్వీనర్ వి.వి.క్రిష్ణారెడ్డి,ఉపాధ్యాయులు రవిశంకర్, రామకృష్ణారెడ్డి, రమణ, గురయ్య, రమేష్ మిద్దెల గ్రామ ప్రజలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంపై మానవ హారం

కలికిరి, జులై 18, ప్రభాతవార్త:

మండలంలోని కలికిరి మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద డిప్యూటీ ఎంపీడీవో మహ్మద్ రియాజుద్దీన్, పంచాయతీ పీడీవో అశోక్ ఆధ్వర్యంలో స్వర్ణంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంపై ర్యాలీ నిర్వహించి అన్ని శాఖల గ్రామ, మండల స్థాయి అధికారులు, సచివాలయం సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, వెలుగు తదితరులతో మానవ హారం నిర్వహించి ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా డిప్యూటీ ఎంపీడీవో మహ్మద్ రియాజుద్దీన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో ప్రతి నెల 3వ శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించడం విధితమే, కావున ప్రతి గ్రామంలో ప్రతి రోజు చెత్త సరఫరా చేసే వాహనాలు అందుబాటులో ఉన్నాయి. స్వచ్ఛ రథం తదితర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన కాల్స్ వస్తే నంబరు1 అని నొక్కి చెప్పడం జరుగుతున్నది. అదే విధంగా ప్రతి రోజు స్వచ్ఛ రథం వాహనం ప్రతి గ్రామానికి వచ్చి ఇంటిలో ఉన్న ప్లాస్టిక్ వస్తువులు, ఇనుప సామానులు, పేపర్లు, పుస్తకాలు, ప్లాస్టిక్ బాటిళ్లు తదితర వస్తువులను కొనుగోలు చేసి ఇంటికి అవసరమైన నిత్యావసర సరుకులు,పిల్లలకు కావాల్సిన తిరుబండారాలు అవి వద్దు అనుకున్న వారికి వసఉతువులు తూకం బట్టి డబ్బు రూపంలో చెల్లించడం చేయడం జరగడం వల్ల ప్రజలు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారని డిప్యూటీ ఎంపీడీవో మహమ్మద్ రియాజుద్దీన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తాగునీటి సరఫరా ఇంజినీరింగ్ అధికారి వేణుగోపాల్‌రెడ్డి, మండల స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ రీసోర్స్ కోఆర్డినేటర్ శంకర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుంధతి, సర్తాజ్ బేగం, సచివాలయ సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది, అంగన్‌వాడీ, వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

